www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -56 బుధవారం 10 జూన్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

## కాంగ్రెస్‌కు షాక్

**రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ**



**న్యూఢిల్లీ: జూన్ 9 (ప్రజావినికిడి):**
రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ స్థానానికి బరిలో నిలిపిన కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి మంగళవారం నాడు తిరస్కరించారు. ఆమె తన అఫిడవిట్‌లో ఒక క్రిమినల్ కేసు వివరాలను దాచిపెట్టారని బీజేపీ ఆరోపించడంతో నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో బిజెపికి చెందిన**మిగతా 2లో...**

# మహిళా సాధికారతకు మరో ముందడుగు

**మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ**

**ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు పెద్దపీట**

**వారిని కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు**

**మహిళల స్ఫూర్తితోనే తమ ప్రజాపాలన సాగుతోంది**

**వారి దెబ్బకే కొందరు ఫ్రామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు**

**కెసిఆర్ హయాంలో మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు**

**బిజెపి కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు**

**పరేడ్ గ్రౌండ్స్ సభలో సిఎం రేవంత్ రెడ్డి**




**హైదరాబాద్,జూన్ 9 (ప్రజావినికిడి):**
మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం ప్రారంభించి ప్రసంగించారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోని తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి**మిగతా 2లో...**


## ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని నిరూపిస్తావా

**నిరూపిస్తే వెంటనే రాజీనామా చేస్తా**

**సిఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి సవాల్**



**న్యూఢిల్లీ,జూన్ 9 (ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం సాధించినా తెలంగాణ ప్రజల బతుకులు మాత్రం మారలేదంటూ కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.**మిగతా 2లో...**



# వృద్ధి రేటు పెంపుపై సీఎం ఫోకస్..

**పనితీరు ఆధారంగా శాఖలకు స్కోరింగ్**

**వివిధ శాఖలకు కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు నిర్దేశించిన సీఎం**

**పనితీరు ఆధారంగా స్కోరింగ్ విధానం అమలుకు నిర్ణయం**

**ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికల రూపకల్పన**

**ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్ ఫోర్స్ ఏర్పాటుపై ఆలోచన**

**2047 స్వర్ణాంధ్ర లక్ష్య సాధన కోసం డేటా ఆధారిత పాలనపై దృష్టి**



**అమరావతిజూన్ 9 (ప్రజావినికిడి):**
అన్ని రంగాల్లో అభివృద్ధిని మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జిఎస్‌డిపి, జివిఎలపై ప్రణాళిక శాఖతో పాటు ఇతర శాఖల అధికారులతో అయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ శాఖల్లో కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లపై దిశానిర్దేశం చేశారు.**మిగతా 2లో...**



# అండగా ఉంటాం

**స్టీల్ ప్లాంట్ బాధిత కుటుంబాలకు పవన్ ,లోకేశ్ పరామర్శ**

**అధికారుల నుంచి వివరాలు ఆరా**

**కిమ్స్ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన డిప్యూటీ సీఎం**

**బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ**

**నిపుణుల కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు**

**త్వరలో కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహిస్తానని వెల్లడి**

2లో.



## హైదరాబాద్‌ను ముంచెత్తిన కుండపోత

**పాతబస్తీలో విద్యుద్ఘాతంతో ఇద్దరు యువకులు మృతి..లోతట్టు ప్రాంతాలు జలమయం**

**విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం -క్షేత్రస్థాయిలో డీఆర్ ఎఫ్ సేవలు**

**ట్యాంక్‌బండ్‌పై నిలిచిన వరదను పరిశీలించిన హైడ్రా కమిషనర్**

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనూ భారీ వర్షం**






## భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగానే అడుగులు...

**స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామికవృద్ధికి ప్రాధాన్యం**

**పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములు**

**'ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**

2లో.

## రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు ఏటీఎంలుగా మారాయి

**:: రాంచందర్ రావు**



2లో.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# వృద్ధి రేటు పెంపుపై సీఎం ఫోకస్..

**మొదటిపేజీ తరువాయి**

అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వివిధ ప్రభుత్వ శాఖలకు కీ పెర్ఫార్మెన్సు ఇండికేటర్లపై లక్ష్యాలను నిర్దేశించారు. ఇప్పటికే పలు శాఖల్లో జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్న సూచికలను మెరుగు పరచి అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా చేరుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. నిర్దేశించుకున్న లక్ష్యాలతోపాటు వాస్తవిక వృద్ధి ఆధారంగా పనితీరును అంచనా వేసేలా స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని స్పష్టం చేసారు. అలాగే రాష్ట్ర, క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇదే సమయంలో మౌలిక సదుపాయాలపై చేసే వ్యయంపైనా సమీక్షించారు. ఈ రంగంపై చేసే వ్యయంలో కనీసం 3.5 రెట్ల వరకు ఆర్థిక కార్యకలాపాలు జరిగేలా ప్రోత్సాహం అందించాలన్నారు. రియల్ టైమ్ లో ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారంగా టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలని సూచించారు. 2047 వరకు నిర్దేశించుకున్న స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా గవర్నెన్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని రంగాల్లో సమగ్ర వాల్యూ అడిషన్ పెంచేందుకు శ్రద్ధ పెట్టాలన్నారు. ఉత్పాదక రంగం, తయారీ, గనులు, వాణిజ్యం, రవాణా వంటి రంగాలపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు, పోర్టులు, ఎయిర్ పోర్టులతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేసేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ రంగాల్లో కేపీఐలు ఎంత మెరుగ్గా ఉంటే వృద్ధి రేటు కూడా అంతగా పెరుగుతుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. జిఎస్డిపి పైన అధికారులతో చర్చించారు. అన్ని శాఖల్లో నిర్దేశించిన వృద్ధిని సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**నేడు ఢిల్లీకి సిఎం చంద్రబాబు**

ఎన్‌డిఎ, నీతి ఆయోగ్ సమావేశాలకు హాజరు సిఎం చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనకు ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ నెల 10, 11వ తేదీల్లో సిఎం ఢిల్లీలో ఉండనున్నారు. 10వ తేదీ బుధవారం నాడు ఉదయం 11:30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీ బయలుదేరి వెళతారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాల సమావేశానికి ఆయన హాజరవుతారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ సమావేశంలో పాల్గొంటారు. 11వ తేదీ గురువారం నాడు రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 9:15 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సమావేశం జరగనుంది. అనంతరం ఢిల్లీ నుంచి బయలుదేరి రాత్రి 9 గంటలకు సిఎం చంద్రబాబు అమరావతి చేరుకుంటారు.

# అండగా ఉంటాం

## స్టీల్ ప్లాంట్ బాధిత కుటుంబాలకు పవన్ ,లోకేశ్ పరామర్శ





**విశాఖపట్నం,జూన్ 9 (ప్రజావినికిడి):** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. మంగళవారం ఉదయం కేజీహెచ్ ఆస్పత్రికి చేరుకున్న మంత్రి.. మార్చురీలో ఎంతమంది ఉన్నారనే దానిపై జాయింట్ కలెక్టర్ విద్యాధరిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో చనిపోయిన ఎమినిది మంది బంధువులను పరామర్శించారు. వారి నుంచి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆపై సెవెన్ హిల్స్ ఆస్పత్రికి మంత్రి వెళ్లారు. స్టీల్ ఎ÷-లాంట్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సూరిబాబు, పైడిరాజు, పి.శ్రీనివాసరావు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని, ఆసుపత్రిలో అందుతున్న చికిత్సను వైద్యులను అడిగి తెలుసుకున్నారు . అనంతరం గాయపడిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని లోకేశ్ చెప్పారు. మంత్రి లోకేశ్‌తో పాటు కేంద్రమంత్రి భూపతి రాజు, హోంమంత్రి అనిత, ఎంపీ భరత్, పల్లా శ్రీనివాసరావు.. వాసంసెట్టి బాధితులను పరామర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం జరిగింది. లాడిల్ నుంచి ద్రవ ఉక్కు బకెట్లు కింద పడిపోయాయి. పలువురు కార్మికులపై ద్రవ ఉక్కు పడి అక్కడికక్కడే బూడిదయ్యారు. ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టలేని విధంగా మారాయి. అటు ఎనిమిది మృతదేహాలను పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. మృతదేహాలను గుర్తించేందుకు మృతుల బంధువుల శాంపిల్స్‌ను తీసుకుని ల్యాబ్‌కు పంపిస్తామని వైద్యులు చెబుతున్నారు. డీఎన్ఏ పరీక్షలు పూర్తయ్యేందుకు నాలుగు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారు విశాఖలోని కిమ్స్, సెవెన్ హిల్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖకు చేరుకున్న ఆయన కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులను స్వయంగా అడిగి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం స్టీల్ ప్లాంట్‌లోని ప్రమాద స్థలాన్ని పరిశీలించి యాజమాన్యం, ఉన్నతాధికారులతో మాట్లాడారు.ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 10 లక్షల చొప్పున సాయం అందిస్తామని, వారి పూర్తి చికిత్స ఖర్చులను ఆర్.ఐ.ఎన్.ఎల్. భరిస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం కల్పిస్తామన్నారు. పదవీ విరమణ ప్రయోజనాల కింద రెగ్యులర్ ఉద్యోగులకు రూ. 1.72 కోట్లు, కాంట్రాక్టు ఉద్యోగులకు రూ. 45.75 లక్షలు అందుతాయని వివరించారు. మృతుల పిల్లల చదువులకు కూడా యాజమాన్యం సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.గత 30 ఏళ్లలో ఇలాంటి ఘోర దుర్ఘటన జరగలేదని పవన్ పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన ముందు రోజు రాత్రి కూడా ప్లాంట్‌లో ఇలాంటి చిన్న సాంకేతిక లోపం తలెత్తిందని, అయితే రాత్రి వేళ కార్మికులు ఎవరూ లేకపోవడం వల్ల ఎవరికీ తెలియలేదని తన దృష్టికి తెచ్చారని ఆయన వివరించారు. ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు, యంత్రాల ఆధునికీకరణపై దర్యాప్తు చేయడానికి ఒక ప్రత్యేక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని, వారి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.స్టీల్ ప్లాంట్ కార్మికుల సమస్యలపై, వారి భద్రతపై త్వరలోనే ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి స్వయంగా కార్మికులతో మాట్లాడతానని పవన్ హామీ ఇచ్చారు. ఇలాంటి ఘోర ప్రమాదాలు జరిగినప్పుడు కేవలం బాధపడి వదిలేయకుండా.. ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ కల్పించేందుకు యాజమాన్యం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# మహిళా సాధికారతకు మరో ముందడుగు

**మొదటిపేజీ తరువాయి**

ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని ప్రస్తావించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. మహిళా సంఘాల్లో 67 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నారని తెలిపారు. ఆడబిడ్డలతో పెట్టుకుంటే అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. తమ అక్కలు పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌లో పండుకున్నారని విమర్శించారు. ఉచిత బస్సుతో స్కూళ్లలో ఆడపిల్లల డ్రాపౌట్స్ తగ్గాయని అన్నారు. ఉచిత బస్సు పథకం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కడుపు నిండా విషం పెట్టుకుని ఉచిత బస్సు పథకం ఆపాలని కొంతమంది చూశారని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి రోడ్డుపైకి పంపారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు. 27 వేల స్కూళ్ల నిర్వహణ బాధ్యత కూడా ఆడబిడ్డలకు అప్పగించామని తెలిపారు. మిడ్ డే మీల్ పథకం సరుకులు కూడా మహిళలే సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. పెట్రోల్ బంకుల నిర్వహణ అప్పగించడంతో లక్షలు సంపాదిస్తున్నారని చెప్పుకొచ్చారు. 8 వేల స్త్రీ శక్తి భవనాలు ఒకేసారి పూర్తిచేస్తామని అన్నారు. కార్పొరేట్ ఆఫీస్‌ల కంటే మిన్నగా స్త్రీ శక్తి భవనాలు ఉంటాయని వివరించారు. హైటెక్ సిటీ దగ్గర మహిళలకు రూ.1000 కోట్ల భూమి కేటాయించామని ప్రస్తావించారు. 106 స్టాల్స్‌తో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో మాల్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. దళారులు, దోపిడీదారులకు తమ ప్రభుత్వంలో చోటులేదని స్పష్టం చేశారు. 2034 వరకు ప్రజాప్రభుత్వం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు అండగా ఉండే బాధ్యత తమదని తెలిపారు. ఎవరెన్నీ కుట్రలు చేసినా మహిళా సంఘాలను ఆదుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రూ.60 వేల కోట్ల రుణాలతో ఆర్థికంగా నిలబెడుతున్నామని తెలిపారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలని మంచి చీరలు ఇస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన చీరలను ఎవరైనా కట్టుకున్నారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల సంక్షేమానికి అన్నివేళలా కృషిచేస్తామని తెలిపారు. పంట మార్పిడి విషయంలో మహిళలు చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

మన సంస్కృతి, సంప్రదాయల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుంది. మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును గత ప్రభుత్వం చెల్లించలేదు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయింది. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం‘ అన్నారు. అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారు. వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలు. ఆడబిడ్డ పుడితే.. మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనది. మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తిపు ఉంది. మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుంది. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని మేం పరిపాలన చేస్తున్నాం. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టింది. భారత్‌కు స్వాతంత్య్రం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకే దక్కుతుందని రేవంత్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారు. సోనియా గాంధీ 2013లో చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు ప్రవేశపెట్టారు. అంబానీ, ఆదానీలకు పోటీగా పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే మహిళా శక్తి భవనాలు నిర్మిస్తామని అన్నారు.

# రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు ఏటీఎంలుగా మారాయి :: రాంచందర్ రావు

**ధాన్యం కొనుగోలు వ్యవహారంలో ప్రభుత్వంపై రాంచందర్ రావు విమర్శలు**

**ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని వ్యాఖ్య**

**కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపాటు**

**హైదరాబాద్,జూన్ 9 (ప్రజావినికిడి):**

తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భువనగిరి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ధాన్యం దిగుబడుల అంచనాలను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్రానికి సరైన ఇండెంట్ పంపలేకపోయిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని, రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రమే రీయింబర్స్‌మెంట్ అందిస్తుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్త సేకరణలో దాదాపు 50 శాతం తెలంగాణ నుంచే జరిగినప్పటికీ.. కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు.

రైతుల సమస్యలను పక్కనబెట్టి, వాస్తవాలను దాచిపెడుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఇదే క్రమంలో పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మూసి ప్రక్షాళన ప్రాజెక్టులు సీఎం రేవంత్ రెడ్డికి ‘ఏటీఎం’లుగా మారాయని రాంచందర్ రావు సంచలన ఆరోపణలు చేశారు. తాము మూసి ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, కేవలం ‘గాంధీ సరోవర్’ ప్రాజెక్టుకే తమ అభ్యంతరమని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని, అలాగే కాళేశ్వరం అవినీతి అంశంలో కేసీఆర్‌ను కాపాడేందుకే ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆయన ఆరోపించారు

# కాంగ్రెస్‌కు షాక్

**మొదటిపేజీ తరువాయి**

మహేష్ కేవత్ ఏకగ్రీవంగా ఎన్నికవడం ఖాయమైంది. తెలంగాణలో కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఒక కేసుకు సంబంధించిన వివరాలను మీనాక్షి తన అఫిడవిట్‌లో పేర్కొనలేదని, అందువల్లే ఆమె నామినేషన్‌ను తిరస్కరించామని ఎన్నికల అధికారులు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అధిష్టాన పెద్దలు కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) అధికారులను కలిసి విజ్ఞప్తి చేయనున్నారు. కాగా కాంగ్రెస్ విజ్ఞాపనపై బుధవారం నాడు సిఇసి స్పందించేవీలుంది.

కర్ణాటకకు చెందిన మీనాక్షి నటరాజన్..కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి సన్నిహితురాలిగా పేరొందారు. ఆమె యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలుగా పనిచేశారు. ఈ స్థానంలో పార్టీ సీనియర్ నాయకులు దిగ్విజయ్ సింగ్‌కు బదులుగా మీనాక్షిని బరిలోకి దించడంపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సింగ్‌కు బదులుగా మీనాక్షిని బరిలోకి దించితే, కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బిజెపికి ఓటు వేయవచ్చని సీనియర్ నేత నరేష్ జ్ఞాన్‌చందాని ఇదివరకే పేర్కొన్నారు. రాష్ట్ర నాయకత్వంతో సరైన సంప్రదింపులు జరపకుండా మీనాక్షిని బరిలోకి దించడం తగదని జ్ఞాన్‌చందాని సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ నేపథ్యంలోనే సోమవారం నాడు మీనాక్షి నామినేషన్ దాఖలు చేశారు. ఆ వెంటనే జ్ఞాన్‌చందాని కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. దీంతో కేవలం రెండు సీట్లు మాత్రమే గెలిచే అవకాశం ఉన్న బిజెపి, మూడో సీటుకు తన అభ్యర్థిని ప్రకటించింది. తాజా పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బెంగళూరులోని ఒక రిసార్ట్‌కు తరలించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

# ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని నిరూపిస్తావా

**మొదటిపేజీ తరువాయి**

అప్పులు తెచ్చి సోకులు చేస్తున్నారంటూ గత బీఆర్ఎస్, ప్రస్తుత రేవంత్ సర్కార్ తీరును ఆయన ఎండగట్టారు. హైదరాబాద్‌లో భూములు మిగిలే పరిస్థితి లేదన్నారు. మంత్రులతోపాటు అందరూ భూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని చెప్పారు. ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదన్నారు.సీఎం రేవంత్ రెడ్డి బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానన్నారు. సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిలాగా తాను మాటకారిని కాను.. కానీ మాటపై నిలబడే వ్యక్తిని అని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. పదవులు, అధికారం కోసం మాటలు మార్చే వ్యక్తిని తాను కానని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలకు కిషన్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. మీరిచ్చిన ఏ గ్యారంటీ అయినా అమలు చేశారా? అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని వ్యంగ్యంగా అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం, ప్రజలను వంచించడంలో.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలను సీఎం రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను గమనించాలంటూ తెలంగాణ సమాజానికి ఈ సందర్భంగా సూచించారు. సీఎం రేవంత్‌కు తాము గులాంలు కామన్నారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగానే అడుగులు...

**స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామికవృద్ధికి ప్రాధాన్యం**

**పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములు**

**'ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,జూన్ 9 (ప్రజావినికిడి):** భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన 'ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఐటీ, లైఫ్ సైన్సెస్ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, డీప్-టెక్ వరకు తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశ్రమ 4.0 విప్లవంలో భాగంగా దూసుకొస్తున్న ఆటోమేషన్, డీప్-టెక్ సవాళ్లను ఎదుర్కొనేలా రాష్ట్రంలో కాంప్రహెన్సివ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అదే సమయంలో... భవిష్యత్తు తరాలకు మేలు జరిగేలా స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామిక వృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో పారిశ్రామికాభివృద్ధి అనేది కేవలం భూమి, మూలధనంపైనే కాకుండా... మేధో సంపత్తి, నాలెడ్జ్ ఎకానమీ ఆధారంగానే సాధ్యమవుతుందన్నారు. అందుకు... పరిశ్రమల అవసరాలకు, విద్యాసంస్థల శిక్షణకు మధ్య ఉన్న స్కిల్ గ్యాప్ ను పూడ్చాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను స్కిల్ క్యాపిటల్ గా మార్చాలనే సంకల్పంతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను తీసుకొచ్చి... ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతోనే ముందుకెళున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధిని కేవలం హైదరాబాద్ కే పరిమితం చేయకుండా... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నామన్నారు.

# హైదరాబాద్‌ను ముంచెత్తిన కుండపోత

**పాతబస్తీలో విద్యుద్ఘాతంతో ఇద్దరు యువకులు మృతి..లోతట్టు ప్రాంతాలు జలమయం**

**విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం -క్షేత్రస్థాయిలో డీఆర్ ఎఫ్ సేవలు**

**ట్యాంక్‌బండ్‌పై నిలిచిన వరదను పరిశీలించిన హైడ్రా కమిషనర్**

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనూ భారీ వర్షం**



**హైదరాబాద్,జూన్ 9 (ప్రజావినికిడి):**

రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం భారీ నుంచి ఓ మోస్తరు వర్షం కురిసినా.. హైదరాబాద్ నగరంలో వర్ష బీభత్సం సృష్టించింది. మంగళవారం ఉదయం నుంచి వేడి గాలులతో అల్లాడిన జనానికి అమాంతంగా సాయంత్రం మబ్బులు కమ్మేశాయి. ఒక్క సారిగా క్లౌడ్ బరస్ట్ అన్న తీరులో వర్షం దంచి కొట్టింది. చాలా చోట్లు ఈదురుగాలులతో వానపడింది. దీంతో అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. ఫలితంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భారీ వర్షానికి ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలన్నీ వర్షపు నీటితో నిండిపోయా యి. కాలు తీసి వేయటానికి ప్రయత్నిస్తే.. నడుములోతులో మురుగు నీరు చుట్టేసింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు హైడ్రా బృందాలు రంగంలోకి దిగాయి. భారీ వర్షం, ఈదురుగాలులకు పాతబస్తీ బండ్లగూడలో కరెంట్ తీగలు తెగిపడ్డాయి. ఈ ఘటనలో జాఫర్(25), అబూ(16) అనే ఇద్దరు యువకులు మృతి చెందారు. ఛత్తా బజార్‌లో రోడ్డుపై కమాన్ కూలింది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రాణ, ఆస్తినష్టం తప్పింది.

### ఈ ప్రాంతాల్లో భారీ వర్షాలు

నగరంలోని కేపీహెచ్‌బీ, బాచుపల్లి, ప్రగతినగర్, మియాపూర్, చందానగర్, ముషీరాబాద్, చంపాపేట్, వర్ష బీభత్సం కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్, సైదాబాద్, కోఠి, సుల్తాన్‌బజార్, అబిడ్స్, బషీర్‌బాగ్‌లో, నారాయణగూడ, హైదర్‌గూడ, లక్డీకపూల్, ట్యాంక్‌బండ్ ప్రాంతాల్లో వర్షం కురిసింది. మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం, రాజేంద్రనగర్, హైదర్‌గూడ, లంగర్‌హౌస్, కార్వాన్, మెహదీపట్నం, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, చిక్కడపల్లిలో వాన పడింది. బాగ్‌లింగంపల్లి, గాంధీనగర్, బోలక్‌పూర్, కవాడిగూడ, రామ్‌నగర్ ప్రాంతాల్లో వర్షం కురిసింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం · తెలుగు దినపత్రిక
బుధవారం 10 జూన్ 2026

# నాదర్గుల్ లో శ్రీ వాసన్స్ అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్
# 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ






**బాలాపూర్, (ప్రజావినికిడి):** నాదర్గుల్ గ్రీన్ హోమ్స్ కాలనీ సమీపంలోని శ్రీ వాసన్స్ అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్స్‌లో అకాడమీ10వ వార్షికోత్సవ వేడుకలు అలాగే నూతన శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమం ఈనెల 6న అకాడమీ చైర్మన్ వాణి, మేనేజింగ్ డైరెక్టర్ సంపత్ కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడిందిఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి హాజరై నూతన అకాడమీని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీ వాసవి అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ,పది సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తున్న శ్రీ వాసన్స్ అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ ఇప్పటికే పలు ప్రాంతాల్లో తన సేవలను విస్తరించింది. తాజాగా నాదర్గుల్ లో నూతన శాఖను ప్రారంభించడం విశేషం. అకాడమీలో కరాటే,డ్యాన్స్, మ్యూజిక్, ట్యూషన్స్ మరియు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌లు నిర్వహించబడుతున్నాయని, దీనికి సంబంధించిన సర్టిఫికెట్స్ కూడా యానివర్సరీలో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ వార్షికోత్సవ వేడుకలకు కరాటే రంగానికి చెందిన నరేంద్ర,శ్రీనివాస్, సాయి కుమార్, అశోక్ చక్రవర్తి, నాదర్గుల్ ప్రాంతానికి చెందిన రాజకీయ నాయకులు యల్చల మమత సుదర్శన్ రెడ్డి, ఇంద్రసేన,కోటగిరి జంగయ్య,కుమార్ గౌడ్,నరేష్ చారి, లక్ష్మీ యాదవ్ తదితరులు పాల్గొని అకాడమీ అభివృద్ధికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# లారీ డ్రైవర్ గౌస్ ను ఎన్కౌంటర్ చేయాలి..
## బిజెపి రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి..



**మెట్టుగూడ, (ప్రజావినికిడి):** ఖమ్మం జిల్లా కేంద్రంలోని రాపర్తినగర్ కు చెందిన 12 సంవత్సరాల రజక ఆడబిడ్డపై అత్యాచారం జరిపి మూడంతస్తుల బిల్డింగ్ పైనుండి తోసేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసిన లారీ డ్రైవర్ గౌస్ ను వెంటనే ఎన్కౌంటర్ చేయాలని బిజెపి రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెట్టుగూడలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, అన్యం పుణ్యం ఎరుగని 12 ఏళ్ల పసిపాపపై అత్యాచారం చేయడానికి మనసెలా వచ్చిందని వాడు మనిషి కాదని మనిషి ముసుగులో ఉన్న మానవ మృగం అని అన్నారు.ఈనెల ఆరవ తారీఖున అత్యాచారం జరిగితే విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడం దురదృష్టకరమని అన్నారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ను ఆబాసుపాలు చేయడానికి తన కుమారుడు బండి భగీరథ్ ను ఫోక్సో కేసులో ఇరికించి నానా యాగి చేసిన కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ విషయపై ఎందుకు స్పందించడం లేదని అన్నారు. బండి భగీరథ్ కేసులో భగీరథ హిందూ కావడమే ఆయన చేసుకున్న పాపమా అని ఖమ్మంలో జరిగిన పోక్సో కేసులో నిందితుడు ముస్లిం మతానికి చెందిన వాడు కాబట్టి కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు నోరు మెదపడం లేదా అని ప్రశ్నించారు. ఈ విషయపై ప్రభుత్వం వెంటనే స్పందించి లారీ డ్రైవర్ గౌస్ ను వెంటనే ఎన్కౌంటర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# గుంజల్ పహాడ్ గ్రామంలో హైమాస్ట్ లైట్లని ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**కొందుర్గు,(ప్రజావినికిడి):**జిల్లెడ్ చౌదరిగూడ మండలం గుంజల్ పహాడ్ గ్రామంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను ఈ రోజు మంగళవారం సాయంత్రం స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజల సమక్షంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు.గ్రామంలో మెరుగైన వెలుతురు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గుంజల్ పహాడ్ సర్పంచ్ వెంకటయ్య మాజి జడ్పిటిసి తనయుడు రామక్రిష్ణ,మాజీ సర్పంచ్ హనుమంత్ రెడ్డి,ముష్టిపల్లి సర్పంచ్ కన్నా జంగయ్య,ఎదిర సర్పంచ్ విజయలక్ష్మి దామోదర్ రెడ్డి,పెద్దఎలికిచెర్ల సర్పంచ్ సోనీ శేఖర్,చింతకుంటతండా సర్పంచ్ రామ్ చరణ్,మాజీ సర్పంచులు,హరీ నాయక్,గౌస్,శ్రీశైలం,గుంజల్ పహాడ్ ఉపసర్పంచ్ లక్ష్మయ్య,గ్రామ కమిటీ అధ్యక్షులు లాల్,ఉపసర్పంచులు పెద్దఎల్కిచెర్ల బాల్ రాజు,కాసులాబాద్ గణేష్,బీఆర్ఎస్ నాయకులు దశరథం, మల్లయ్య యాదవ్,రమేష్ నాయక్,నవీన్ వార్డు మెంబెర్స్, బీఆర్ఎస్ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సీ.ఎం.రిలీఫ్ ఫండ్‌తో పేదలకు అండగా నిలుస్తున్నాం: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ నందు నివాసం ఉంటున్న శివకుమార్(33 సంవత్సరాలు)కిడ్నీలకు సంబంధిత పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి ని సంప్రదించారు.వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి వారి వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా దరఖాస్తు చేయించారు. దీనికి సంబంధించి రెండు లక్షల రూపాయల ఎల్.ఓ.సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు కాగా బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి మాట్లాడుతూ,పేద ప్రజలకు సేవ చేయడం ద్వారా మాకు ఎంతో సంతృప్తి లభిస్తుంది.నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంతోమంది పేద ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కింది" అని పేర్కొన్నారు.బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, మా కుమారుడి ఆరోగ్య సమస్య విషయంలో సుదీర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందని,ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు ఆనంతుల రాజిరెడ్డి,దీప్ లాల్,ఇటికల యాదగిరి,మహ్మద్ యాసిన్,జోగు నాగేష్,బట్టు అంజయ్య, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు

# మామిడిపల్లి ప్రీమియర్ లీగ్
# సీజన్-2 ఘనంగా ముగింపు

**శ్రీనివాసులగూడా జట్టుకు విజేత ట్రోఫీ - గ్రామీణ క్రీడాకారులకు అండగా ఉంటాం..అనిల్ రెడ్డి**










**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మామిడిపల్లిలో నిర్వహించిన మామిడిపల్లి ప్రీమియర్ లీగ్ (ఎంపిఎల్) సీజన్-2 అండర్-20 క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. మామిడిపల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో ఆరు జట్లు పాల్గొని క్రీడా ప్రతిభను ప్రదర్శించాయి. ఫైనల్ మ్యాచ్‌లో శ్రీనివాసులగూడా జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచి రూ.10,000 నగదు బహుమతిని సొంతం చేసుకుంది.

ఆ జట్టుకు వినయ్ కెప్టెన్‌గా వ్యవహరించారు. రన్నరప్‌గా నిలిచిన మసీదు మామిడిపల్లి జట్టు రూ.5,000 నగదు బహుమతిని అందుకుంది.

ఆ జట్టుకు సాయిరాం నాయకత్వం వహించారు.

ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల యువ క్రీడాకారులు మరింతగా ఎదిగి జిల్లా,రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. గ్రామీణ యువతకు మంచి అవకాశాలు కల్పించేందుకు తాను ఎల్లప్పుడూ సహకారం అందించడానికి సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు.టోర్నమెంట్ విజయవంతానికి సహకరించిన క్రీడాకారులు, నిర్వాహకులు, గ్రామస్తులు అలాగే యువతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ యువ నాయకులు మజీద్,షఫీ, మహేష్, నరసింహ,దర్శన్, రవి,రాకేష్,రాము తదితరులు పాల్గొన్నారు. క్రీడాస్ఫూర్తిని పెంపొందించే ఇటువంటి పోటీలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# కమ్మదానంలో ఐమాక్స్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ నియోజకవర్గంలోని ఫరూక్ నగర్ మండలం కమ్మదానం గ్రామంలో ప్రజల సౌకర్యార్థం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను నిన్న సోమవారం రాత్రి ప్రజాప్రతినిధుల గ్రామ ప్రజల సమక్షంలో ఘనంగా ప్రారంభించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.హైమాస్ట్ లైట్లు ఏర్పాటు వల్ల గ్రామంలో భద్రత పెరగడంతో పాటు రాత్రి సమయంలో ప్రజల రాకపోకలకు సౌలభ్యం కలుగుతుందని అన్నారు.తమ గ్రామానికి ఉపయోగపడే ప్రజాప్రయోజన కార్యక్రమాన్ని సొంత నిధులతో అమలు చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కమ్మధానం సర్పంచ్ గోదుల లత కిరణ్ కుమార్ గౌడ్,ఉపసర్పంచ్ పెద్ధింటి జగన్నాథ్,కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,పోమాలపల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,లింగం దాన సర్పంచ్ నాగిళ్ల వెంకటేష్,మెల్లగూడ సర్పంచ్ మంగారవి నాయక్,మాజీ సర్పంచులు నర్సిములు,చక్కటి వెంకటేష్ యాదవ్,తాంద్ర విష్ణు వర్ధన్ రెడ్డి,శేఖర్ పంతులు,యారం శేఖర్ రెడ్డి,కమ్మదానం గ్రామకమిటి అధ్యక్షులు శివగాళ్ల రాజు,వార్డు మెంబెర్స్ గులాబ్ శ్రీను,గడ్డమీది లక్ష్మి చెన్నయ్య గౌడ్,సిరిగిరి కవితవెంకటేష్ గౌడ్,చించేటి శేఖర్,కార్కొండ సత్యం,యేన్నెం నారాయణ్ రెడ్డి,శివగాళ్ల ఉమా వెంకటేష్,పెద్దింటి మహేష్, భార్గవి భాను ప్రకాష్ గౌడ్,బీఆర్ఎస్ నాయకులు రాఘవేందర్ రెడ్డి,సురేందర్ రెడ్డి,నిజమోదిన్,శ్రీకాంత్ రెడ్డి,బాల్వంత్ రెడ్డి,హన్మంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి,జోగామ్మాగూడం నర్సిములు,అంజి,బీఆర్ఎస్ కార్యకర్తలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారిన నిజామాబాద్ డీపీఆర్ ఓ కార్యాలయం..

## అక్రిడేషన్ కార్డుల వెనుక రూ.లక్షల దందా.? -ప్రశ్నించే జర్నలిస్టులపై హేళన,కక్ష సాధింపులు..

**కలెక్టర్లకు ఐ అండ్ పిఆర్ కమిషనర్ కు ఉన్నత అధికారులకే తప్పుడు సమాచారం.. -అర్హులైన ఫ్రీలాన్స్, ఫీల్డ్ జర్నలిస్టులకు మొండిచేయి.. -డబ్బులు ఇస్తే అనర్హులకు రెడ్ కార్పెట్..**

**జోయాలుకాస్ ఉద్యోగి, ఇటుకబట్టీ కూలీ, మెస్ సూపర్వైజర్లకు జర్నలిస్ట్ కార్డులా.? -ఒక్కో కార్డుకు రూ. 30,000 నుండి రూ.50,000 వసూలు.?**

**2016 నుండి ఒకే జిల్లాలో పాతుకుపోయిన అధికారి పద్మశ్రీ -నిజాంబాద్ డిపిఆర్ఓ కు బదిలీల ఉత్తర్వులు వర్తించవా.?**

**నూతన కలెక్టర్ చొరవ తీసుకుని నిష్పక్షపాత విచారణ జరిపించాలి: సామాజిక కార్యకర్తల డిమాండ్..**

**నిజామాబాద్, (ప్రజావినికిడి):** ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికారంగాన్ని నిజామాబాద్ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డీపీఆర్ ఓ) కార్యాలయం అభాసుపాలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు శ్రమిస్తూ,వార్తల కోసం ప్రాణాలు పణంగా పెట్టే నిజమైన జర్నలిస్టులను హేళన చేస్తూ, కలెక్టర్,ఐఅండ్ పి ఆర్ కమిషనర్, ఉన్నత అధికారులను సైతం తప్పుదోవ పట్టిస్తున్న ఘనత ఇక్కడి డీపీఆర్ ఓ పద్మశ్రీ కే దక్కుతుంది. నిబంధనలను తుంగలో తొక్కి, అక్రిడేషన్ కార్డుల జారీలో భారీ అవకతవకలకు పాల్పడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను అవినీతిమయం చేస్తున్న తీరుపై జిల్లావ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

### పబ్లిక్ డొమైన్‌లో లిస్టులు పెట్టకపోవడం వెనుక మతలబు ఏంటి.?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం జర్నలిస్టుల అక్రిడేషన్ జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలి.కానీ నిజామాబాద్ డీపీఆర్ ఓ పద్మశ్రీ మాత్రం ఈ లిస్టులను బయటపెట్టడానికి నిరాకరిస్తున్నారు. పబ్లిక్ డొమైన్‌లో పెడితే ఎవరెవరు అర్హులో, ఎవరెవరు అనర్హులో సమాజానికి తెలిసిపోతుందనే భయంతోనే తన అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. 2022-2024, ప్రస్తుత 2026-2028 కాలానికి సంబంధించిన అక్రిడేషన్ల జారీలో జరిగిన దారుణాలు వింటే ముక్కున వేలేసుకోవాల్సిందే.

### జర్నలిజంతో సంబంధం లేని వారికి 'అక్రిడేషన్' బహుమతి..

24 గంటలు ఫీల్డ్‌లో పనిచేసే సీనియర్ జర్నలిస్టులను, దశాబ్దాలుగా నమ్ముకున్న ఫ్రీలాన్స్ జర్నలిస్టులను పక్కనపెట్టి,కనీస అర్హత లేని సుమారుగా 70 మందికి పైననే అనర్హులకు అక్రిడేషన్ కార్డులు కట్టబెట్టారు.
ఒక ప్రముఖ జ్యువెలరీ సంస్థ (జోయాలుకాస్) లో పనిచేసే వ్యక్తికి జర్నలిస్ట్ కార్డు జారీ చేశారు.
నవీపేటలోని ఒక ఇటుకబట్టీలో పనిచేసే వ్యక్తికి అక్రిడేషన్ ఇచ్చారు.
నిజామాబాద్ జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లోని ఒక మెస్‌లో సూపర్వైజర్‌గా పనిచేసే వ్యక్తికి, మోర్తాడ్‌లో మొరం దందా (మట్టి వ్యాపారం) చేసే వ్యక్తికి సైతం జర్నలిస్టు కార్డులు జారీ కావడం డీపీఆర్ ఓ పద్మశ్రీ 'అవినీతి ప్రతిభ'కు నిదర్శనం.
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉచితంగా ఇస్తున్న ఈ కార్డులను అమ్ముకుంటూ, ఒక్కో కార్డుకు రూ. 30,000 నుండి రూ. 50,000 వరకు లంచాలు వసూలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



### పదేళ్లుగా ఒకే జిల్లాలో మకాం.. బదిలీల నిబంధనలు వర్తించవా.?

సాధారణంగా ప్రభుత్వ అధికారులకు మూడు లేదా నాలుగేళ్లకు బదిలీలు జరుగుతాయి. కానీ 2016 ఉమ్మడి జిల్లా కాలం నుండి నేటి 2026 వరకు సదరు డీపీఆర్ ఓ పద్మశ్రీ నిజామాబాద్ జిల్లాలోనే తిష్ట వేసుకొని కూర్చున్నారు. ఉన్నత అధికారులకు తాయిలాలు ఇస్తూ రాజకీయ నాయకులను మేనేజ్ చేస్తూ బదిలీ ఉత్తర్వులు తనకు వర్తించకుండా చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.కాంట్రాక్టర్ల నుండి డిమాండ్లు.. అవుట్‌సోర్సింగ్ నియామకాల్లో గోల్‌మాల్ గతంలో మాజీ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి హయాంలో ఒక కాంట్రాక్టర్ నుండి ఈ డీపీఆర్ ఓ ఏకంగా రెండు లక్షల రూపాయలు ఫోన్ లోనే డిమాండ్ చేసినట్లు సమాచారం.దీనిపై ఇప్పటివరకు ఎలాంటి విచారణ జరగకుండా అధికారులను మేనేజ్ చేసినట్లు గుసగుసలు వినిపించాయి. ఇప్పటివరకు చర్యలూ లేవు. అంతేకాకుండా, డీపీఆర్ ఓ కార్యాలయంలో జరిగిన అవుట్‌సోర్సింగ్ నియామకాల్లో కూడా భారీగా అవకతవకలు జరిగాయని పత్రికల్లో కథనాలు వచ్చినా కలెక్టర్, జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది.

### నూతన కలెక్టర్ న్యాయం చేసేనా.?


ప్రజాధనంతో నడిచే ఒక బాధ్యతాయుతమైన ప్రభుత్వ కార్యాలయం ఇలా ప్రజల విశ్వాసాన్ని కోల్పోతే, ఆ ప్రభావం మొత్తం జిల్లా పరిపాలనపై పడుతుందని సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకు నూతనంగా విచ్చేసిన,ప్రజా సమస్యలపై తల్లిలా స్పందించే కలెక్టర్ ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించాలి. తక్షణమే నిష్పక్షపాత విచారణ జరిపి, అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని, అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన సదరు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా సమాజ పరిరక్షణ కమిటీ మరియు సామాజిక కార్యకర్తలు బలంగా డిమాండ్ చేస్తున్నారు.
జర్నలిస్ట్ ల పై కక్ష సాధింపు లు చేస్తూ పై అధికారులకు తప్పుడు రిపోర్ట్ ను పంపినందుకు డిపిఆర్ ఓ పద్మశ్రీని వెంటనే సస్పెండ్ చేయాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి.

---

# ఏసీబీ కి చిక్కిన మరో భారీ తిమింగలం

## ఆర్ అండ్ బీ ఈఎన్ సీ అక్రమాస్తులు వంద కోట్ల పైనే -ఏసీబీ దాడుల్లో వెల్లడి

**హైదరాబాద్,జూన్ 9: (ప్రజావినికిడి):** రాష్ట్రంలో మరో భారీ అవినీతి తిమింగలం ఏసీబీ వలకు చిక్కింది. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖలో ఛీఫ్ ఇంజనీరుగా పని చేస్తున్న మోహన్ నాయక్ అవినీతి అక్రమాలకు పాల్పడి దాదాపు వంద కోట్ల రూపాయలకు పైగా ఆస్తులను సంపాదించినట్టు ఏసీబీ మంగళవారం జరిపిన అకస్మిత దాడులో వెల్లడైంది. ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా తెలిపిన వివరాల ప్రకారం ఆర్ అండ్ బి లో ఛీఫ్ ఇంజనీర్ గా పనిచేస్తున్న మోహన్ నాయక్ అవినీతి అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయల ఆస్తులను సంపాదించినట్టు ఏసీబీకి విశ్వసనీయ సమాచారం అందింది. దీనితో తమ విభాగానికి చెందిన ప్రత్యేక టీమ్ లను చారు సిన్హా రంగంలోకి దించారు. వీరు మోహన్ నాయక్ కు చెందిన ఇల్లు, ఇతర ఆస్తులతో పాటు అతని సమీపబంధువులు, స్నేహితులు,బినామీల ఆస్తులపై మెరుపు దాడులను నిర్వహించారు. హైదరాబాద్, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లోని మోహన్ నాయక్ కు చెందిన 15 ఆస్తులపై ఈ దాడులను కొనసాగించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఈ దాడులు



కొనసాగాయి. ఇందులో మోహన్ నాయక్ కు చెందిన స్థిర, చర, ఆస్తుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లిలో రూ. 82,89,750/- లక్షల విలువైన 19.38 ఎకరాల వ్యవసాయ భూమి, రూ. 7,34,73,867/- కోట్ల విలువైన కొంపల్లిలోని 3 ఫ్లాట్లు,గచ్చిబౌలిలోని 4 ఫ్లాట్లను ఏసీబీ అధికారులు కనుగొన్నారు.
అలాగే మియాపూర్ లో రూ.2,50,00,000/- విలువైన 3× విల్లా, కూకట్ పల్లిలో కొత్తగా నిర్మించిన రూ.62,14,000/- విలువైన కొత్త ఇల్లు తో పాటు నిజామాబాద్ లో కొత్త ఇంటి నిర్మాణం కోసం నాయక్ చెల్లించిన కోటి రూపాయల నగదు రసీదు కూడా ఏసీబీ కి చిక్కాయి. దీంతోపాటు అతని నివాసం లో 55 లక్షల రూపాయల విలువైన నగదు, రూ.1.44 కోట్ల బ్యాంకు బాలన్స్ , రూ.2 కోట్ల విలువైన 2500 గ్రాముల బంగారు నగలు, రూ.3.60 లక్షల విలువైన 6000 గ్రాముల వెండి నగలు కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూ. 1,26,00,000/- కోట్ల విలువైన గృహోపకరణ వస్తువులు,11 లక్షల రూపాయల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, రూ. 25 లక్షల విలువైన 2 వాహనాలు కూడా నాయక్ కు చెందినవిగా తేలాయి. వీటి విలువ రూ.17,94,62,617/- కోట్ల రూపాయలుగా అధికారులు గుర్తించారు. వీటి విలువ బహిరంగ మార్కెట్లో వంద కోట్ల రూపాయలకు పైనే ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఇంకా మోహన్ నాయక్ అక్రమాస్తుల గురించి దర్యాప్తు సాగుతున్నదని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మోహన్ నాయక్ పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును నమోదు చేశామని, నిందితుని అరెస్ట్ చేసి ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరు పరిచామని అధికారులు తెలిపారు.

# సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ అభివృద్ధికి సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలని

## మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కు వినతి..

### -మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**మంగళవారం రోజు బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ సంక్షేమ సంఘం భవన నిర్మాణం కొరకు సహకరించాలని కాలనీ అభివృద్ధికి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది.స్పందించిన పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ, అతి త్వరలోనే కాలనీ అభివృద్ధికి మరియు సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు చప్పిడి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నిట్టు కృష్ణ, ఉపాధ్యక్షులు వరప్రసాద్, కోశాధికారి సుదర్శనం, సంయుక్త కార్యదర్శి కృష్ణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపి,కార్యవర్గ సభ్యులు పాండు, జయరాజు,రాజు, ఉమాశంకర్, ప్రవీణ్,మహేష్ పార్టీ సీనియర్ నాయకులు రవిశంకర్,పిట్ట శ్రీనివాస్ రెడ్డి, సుధీర్ కుమార్, చిన్న యాదవ్, దిలీప్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రల వల్లే ప్రమాదాలు

**: బొత్స సత్యనారాయణ**

**జూన్ 9: (ప్రజావినికిడి):**
విశాఖ స్టీల్ ప్లాంట్ ఘోర ప్రమాదంలో గాయపడి కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైసీపీ నేతలు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, కేకే రాజులతో కూడిన బృందం పరామర్శించింది. అనంతరం మీడియాతో బొత్స మాట్లాడుతూ... ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు చనిపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. బాధితులు కోరుతున్న పరిహారం గొంతెమ్మ కోరిక కాదని, ప్రభుత్వం వారి డిమాండ్లను తక్షణమే అంగీకరించాలని చెప్పారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి స్టీల్‌ప్లాంట్‌ను తమ తాబేదార్లకు కట్టబెట్టేందుకు, ప్రైవేటీకరణ చేసేందుకే కుట్రలు చేస్తోందని



మండిపడ్డారు. ఈ కుట్రల వల్లే ప్లాంట్‌లో వరుస ప్రమాదాలు జరుగుతూ కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఆరోపించారు.స్టీల్ ప్లాంట్ నుంచి సమర్థులైన, అనుభవజ్ఞులైన అధికారులను దొడ్డిదారిన బదిలీ చేయడం వల్లే ఈ భారీ ప్రమాదం చోటుచేసుకుందని బొత్స విమర్శించారు. ఇప్పటికే దాదాపు 10 వేల మంది శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులను అన్యాయంగా తొలగించారని, ఇకనైనా బలవంతపు వీఆర్ఎస్ చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు 'ఎల్జీ పాలిమర్స్'తరహాలో కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని, ఈ విషయంలో వైసీపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చి చెప్పారు. అలాగే, బాధితులను పరామర్శించేందుకు జగన్ రేపు విశాఖలో పర్యటిస్తారని వెల్లడించారు.

# బాసరలో విషాద ఘటన

## గోదావరిలోకి దిగి ముగ్గురు గల్లంతు

### హైదరాబాద్,కు చెందిన అన్నదమ్ములుగా గుర్తింపు

**నిర్మల్,జూన్ 9 (ప్రజావినికిడి):** బాసరలో మంగళవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి వెళ్లిన ముగ్గురు భక్తులు ప్రమావదశాత్తూ గోదావరి నదిలో గల్లంతయ్యారు. హైదరాబాద్‌లోని కాచిగూడ చప్పల్ బజార్‌కు చెందిన ఓ కుటుంబం.. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి వెళ్లారు. అయితే, దర్శనానికి ముందు పుణ్యస్నానాలు ఆచరించేందుకు కుటుంబ సభ్యులు గోదావరి నదిలోకి దిగారు. లోతును సరిగ్గా అంచనా వేయలేకపోవడంతో బాధిత కుటుంబానికి చెందిన ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. కాగా, గల్లంతైన చంద్రశేఖర్ (38), రామచందర్ (36), మల్లేశ్ కుమార్ (31) అన్నదమ్ములుగా తెలుస్తోంది. ఈ ప్రమాదాన్ని గమనించిన గజ ఈతగాళ్లు.. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అన్నదమ్ములు ముగ్గురు నీటిలో మునిగిపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వారిని సురక్షితంగా కాపాడాలని అమ్మవారిని వేడుకున్నారు. మరోవైపు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి బయలుదేరారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సిందే.

**-రెండో రోజు కొనసాగిన పెంకు కార్మికుల సమ్మె. -చర్చలకు రావాలని యాజమాన్యాలకు హెచ్చరిక.**

**-సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్...**



**బయ్యారం/,జూన్ 9 (ప్రజావినికిడి):** పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు విద్యా-వైద్య ఖర్చుల భారం, కుటుంబ పోషణకు పెరుగుతున్న వ్యయాల నేపథ్యంలో పెంకు కార్మికుల వేతనాలను తక్షణమే పెంచాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోక్ డిమాండ్ చేశారుకార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని పెంకు ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది.తమ వేతనాలను పెంచాలని, పనికి తగిన గౌరవప్రదమైన జీవన వేతనం కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నారు.ఈ సందర్భంగా నెహ్రూనగర్‌లోని ఉషా పెంకు ఫ్యాక్టరీ వద్ద కార్మికులను కలిసిన అశోక్ వారికి సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పరిశ్రమల అభివృద్ధికి కార్మికులే వెన్నెముక. వారి శ్రమతోనే యాజమాన్యాలు లాభాలు ఆర్జిస్తున్నాయి. కానీ కార్మికుల జీవన ప్రమాణాలు మాత్రం రోజురోజుకూ దిగజారుతున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడం అన్యాయం" అని విమర్శించారు. పెంకు తయారీ పరిశ్రమలో పనిచేసే కార్మికులు మండుటెండలు, వర్షాలు, కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ తమ శ్రమను అందిస్తున్నారని, అయినప్పటికీ వారికి కనీస అవసరాలు తీర్చుకునే స్థాయిలో కూడా వేతనాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కుటుంబం గౌరవంగా జీవించాలంటే విద్య, వైద్యం, నివాసం, ఆహారం వంటి మౌలిక అవసరాలు అందుబాటులో ఉండాలని, వాటికి సరిపడే విధంగా వేతనాలు నిర్ణయించాలని అన్నారు. తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ పలుమార్లు యాజమాన్యాలతో చర్చలు జరిపేందుకు ప్రయత్నించినప్పటికీ, ఫ్యాక్టరీ యాజమాన్యాలు స్పందించకుండా మొండి వైఖరి అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల పరిశ్రమల్లో అసంతృప్తి పెరుగుతోందని, ఇది కార్మిక-యాజమాన్య సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కార్మికుల డిమాండ్లను వెంటనే పరిగణనలోకి తీసుకుని చర్చలకు రావాలని యాజమాన్యాలకు పిలుపునిచ్చిన అశోకన్న, సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని సూచించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు వారి పోరాటానికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ అండగా నిలుస్తుందని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.బాబులా శ్రీను,రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే పాషా,రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గ రవి,రాష్ట్ర కోశాధికారి వంగూరి వెంకన్న,రాష్ట్ర నాయకులు జి.గణేష్,ఆదినారాయణ, భూక్య లక్ష్మణ్ తదితరులు పాల్గొని కార్మికులకు మద్దతు తెలిపారు. కార్మికుల ఐక్యతే వారి హక్కుల సాధనకు ప్రధాన ఆయుధమని నాయకులు పేర్కొన్నారు.

# ప్రజా నమ్మకమే కాంగ్రెస్ ప్రభుత్వ బలం

## : మంత్రి పొంగులేటి



**ఖమ్మం, /జూన్ 9 (ప్రజావినికిడి):**రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకానికి పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమం విజయవంతం కావడమే నిదర్శనమని పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.మంగళవారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురాం రెడ్డితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలనప్రగతి ప్రణాళిక"లో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ జూలై 12 నాటికి పూర్తికానుందని తెలిపారు.

14 క్లస్టర్లలో ప్రజా దర్బార్.. 24 వేలకుపైగా దరఖాస్తులుపాలేరు నియోజకవర్గాన్ని 14 క్లస్టర్లుగా విభజించి గత నెల రోజులుగా "ప్రజల వద్దకే ప్రభుత్వం" నినాదంతో ప్రజా దర్బార్ నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 25 వేల మందిని స్వయంగా కలిసి వారి సమస్యలు తెలుసుకున్నట్లు చెప్పారు. మొత్తం 24 వేలకుపైగా దరఖాస్తులు అందగా, అందులో 11 వేల దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్ల కోసం, 5,200 దరఖాస్తులు ఆసరా పింఛన్ల కోసం వచ్చినట్లు వెల్లడించారు.సాదాబైనామాల సమస్యకు శాశ్వత పరిష్కారంగత ప్రభుత్వం ధరణి చట్టం అమలులో రైతులను ఇబ్బందులకు గురిచేసిందని మంత్రి విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం నిబంధనలను సవరించిందన్నారు.

గతంలో భూమి విక్రయించిన వారి సమ్మతి తప్పనిసరిగా ఉండాలనే నిబంధనను తొలగించామని, ఇప్పటికే 5.5 లక్షల దరఖాస్తులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. మిగిలిన వాటికి మరో 15 రోజుల్లో నోటీసుల ప్రక్రియ పూర్తి చేసి, చట్ట ప్రకారం అర్హులైన వారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ఆధునిక భూ సర్వేతో రైతులకు పట్టాలురాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి ఆధునిక డిజిటల్ భూ సర్వే చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని కాకరవాయి గ్రామంలో సర్వే విజయవంతంగా పూర్తయిందన్నారు.

సాగులో ఉన్న వారికే పట్టాదారు పాస్‌బుక్కులు అందించేలా కొత్త విధానాన్ని అమలు చేస్తున్నామని, ప్రజా దర్బార్‌లో అందిన 4,300 భూ సమస్యల దరఖాస్తుల్లో 2,300 సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని వెల్లడించారు.

**ఇళ్ల స్థలాల సమస్యకు త్వరలో పరిష్కారం**

ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను అర్హతల ఆధారంగా విడతలవారీగా మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. ఇళ్ల స్థలాల కోసం 1,500 మంది దరఖాస్తు చేసుకున్నారని, గతంలో సేకరించిన ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులకు స్థలాలు కేటాయించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని చెప్పారు.ప్రతిపక్షాల విమర్శలను ప్రజలు తిరస్కరించారుప్రభుత్వంపై రాజకీయ దురుద్దేశంతో ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రజలు నమ్మడం లేదని మంత్రి పేర్కొన్నారు. ప్రజా దర్బార్‌కు అన్ని పార్టీలకు చెందిన ప్రజలు హాజరయ్యారని, ప్రభుత్వంపై వారికి పూర్తి విశ్వాసం ఉందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ ప్రజల సమస్యలను పరిష్కరించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికల్లో ప్రజలు మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# మహిళా శక్తి సదస్సుకు కదిలిన పర్వతగిరి స్వయం సహాయక సంఘాలు



సికింద్రాబాద్ సభా స్థలికి చేరుకున్న పర్వతగిరి మహిళలు





**పర్వతగిరి/జూన్ 9 (ప్రజావినికిడి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా.. సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్న 'మహిళా శక్తి వారోత్సవాల'కు పర్వతగిరి మండలం నుండి స్వయం సహాయక సంఘాల మహిళలు మంగళవారం భారీగా తరలివెళ్లారు. మదర్ తెరిస్సా మండల సమైక్య ఆధ్వర్యంలో, ఏపీఎం రాజీర్ సారధ్యంలో వివిధ గ్రామాల గ్రామైక్య సంఘాల ప్రతినిధులు ప్రత్యేక ఆర్టీసీ బస్సులో ఈ సీఎం కార్యక్రమానికి బయలుదేరారు.ఈ రాష్ట్ర స్థాయి సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కీలక ప్రకటనలు చేయనున్నారు. మహిళా సంఘాల యాజమాన్యంలోని 553 బస్సుల నిర్వహణను ఆర్టీసీకి అప్పగించడంతో పాటు, మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేయనున్నారు. అలాగే మహిళా గ్రూపుల రుణ పరిమితిని రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షల వరకు పెంచుతూ సీఎం ఈ వేదికపై అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు స్వప్న, కార్యదర్శి రజిత, ప్రతినిధులు ఫరీదా, సీసీలు కొమురయ్య, సుధాకర్, దేవేంద్ర, వివిధ గ్రామాల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బయ్యారం విత్తన షాపుల్లో తనిఖీలు చేసిన అధికారులు..



**బయ్యారం/,జూన్ 9 (ప్రజావినికిడి):** బయ్యారం మండల వ్యవసాయ అధికారి కే.రాజు,బయ్యారం ఎస్ఐ ప్రశాంత్ బాబు సంయుక్తంగా బయ్యారం మండల కేంద్రంలోని అగ్రో రైతు సేవా కేంద్రంలో ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విత్తనాల నిల్వలు,విక్రయ రికార్డులు, లైసెన్సులు సంబంధిత పత్రాలను పరిశీలించి ధృవీకరించారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నకిలీ,నాణ్యతలేని విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ,పోలీస్ శాఖ సంయుక్తంగా నిరంతర పర్యవేక్షణ కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా బయ్యారం మండల రైతులకు సూచిస్తూ, లైసెన్సు లేని వ్యక్తులు లేదా రాత్రిపూట గ్రామాల్లో తిరుగుతూ లూజు విత్తనాలు అమ్మే వ్యక్తుల నుండి విత్తనాలు కొనుగోలు చేయవద్దని,తప్పనిసరిగా లైసెన్సు కలిగిన విత్తన విక్రయదారుల వద్ద నుండే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని కోరారు.అదేవిధంగా విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత కొనుగోలు బిల్లు మరియు ఖాళీ విత్తన ప్యాకెట్లను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు.భవిష్యత్తులో ఏవైనా ఫిర్యాదులు లేదా సమస్యలు తలెత్తిన సందర్భంలో ఈ పత్రాలు ఉపయోగపడతాయన్నారు.రైతులు తొందర పడి ఇప్పుడే విత్తనాలు వేసుకోవద్దు.తగినంత వర్షాలు,పదును వచ్చాకే విత్తనాలను విత్తుకోవాలని రైతులకు సూచించారు.

# అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠకు మంత్రికి ఆహ్వానం

**గ్రామ సమస్యలపై పొంగులేటితో చర్చించిన వీరారెడ్డి**



**కల్లూరు,/ జూన్ 9 (ప్రజావినికిడి):** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని వైరా మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గొల్లగూడెం గ్రామంలో నిర్వహించనున్న అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను మంత్రికి అందజేసి కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ సమక్షంలో ఈ ఆహ్వానం అందజేశారు.అనంతరం గొల్లగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సమస్యలు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు బిరెడ్డి ముత్తారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కోడూరు రాము, గుండ్ల జోగారావు తదితరులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ అంశాలపై మంత్రితో చర్చించినట్లు నాయకులు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల కోసం మంత్రికి వినతులు

**పొంగులేటిని కలిసిన గోపిగౌడ్, యాకూబ్ పాషా**





**ఖమ్మం, /జూన్ 9 (ప్రజావినికిడి):** ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తమకు ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రావుల గోపిగౌడ్, ముస్లిం మైనార్టీ సెల్ నాయకుడు షేక్ యాకూబ్ పాషా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు.మంగళవారం ఖమ్మంలోని కన్వెన్షన్ హాలులో నిర్వహించిన విలేకరుల చిట్‌చాట్ కార్యక్రమం అనంతరం మంత్రిని కలిసిన రావుల గోపిగౌడ్ తన సమస్యను వివరించారు. నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో కొనసాగుతున్నప్పటికీ ఇప్పటికీ సొంత ఇల్లు లేక పూరి గుడిసెలోనే నివాసం ఉంటున్నానని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని అనేక పోరాటాలు చేశానని, గతంలో వైఎస్సార్‌సీపీలో పనిచేస్తూ జిల్లా వ్యాప్తంగా పాదయాత్రల్లోనూ పాల్గొన్న విషయాన్ని మంత్రికి గుర్తు చేశారు.ప్రస్తుతం నివాస సమస్యతో ఇబ్బందులు పడుతున్న తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు గోపిగౌడ్ తెలిపారు.అదేవిధంగా ముస్లిం మైనార్టీ సెల్ నాయకుడు షేక్ యాకూబ్ పాషా కూడా తనకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని మంత్రికి వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యలను పరిశీలించి న్యాయం చేయాలని ఇద్దరు నాయకులు కోరారు

# పాస్టర్లపై ఇందిరమ్మ కరుణ ఎప్పుడో..?

**ఇల్లు కోసం ప్రభుత్వానికి వినతి**



**తల్లాడ,/ జూన్ 9 (ప్రజావినికిడి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిరుపేద క్రైస్తవ పాస్టర్లను కూడా చేర్చి ఇళ్లు మంజూరు చేయాలని తల్లాడ మండల టీసీసీ అధ్యక్షుడు బ్రదర్ ఇశ్రాయేలు కోరారు.మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్న పలువురు పాస్టర్లు ఇప్పటికీ సొంత ఇల్లు లేక అద్దె గదుల్లోనే జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన పాస్టర్లకు ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తే వారి కుటుంబాలకు భరోసా కలుగుతుందని అన్నారు.

పాస్టర్ల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నిరుపేద క్రైస్తవ కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు."సేవ చేస్తున్న వారికి సొంత గూడు కల్పించాలి" అంటూ ప్రభుత్వాన్ని బ్రదర్ ఇశ్రాయేలు అభ్యర్థించారు.

# ట్రంప్‌కు వీసా దెబ్బ




**జూన్ 9 (ప్రజావినికిడి):**
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మహాశయుడికి ఎదురుగాలి వీస్తోంది. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఇరాన్‌పై యుద్ధం చేయడాన్ని అమెరికా పౌరులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. ఇక ప్రపంచమంతా కూడా ట్రంప్ యుద్ధ పిపాసపై మండిపడుతోంది. అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలో పడ్డాయి. ఇంధనం దొరక్క అనేక దేశాలు అల్లాడి పోతున్నాయి. ఈ తరుణంలో ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. తాజాగా విదేశీ వృత్తి నిపుణుల హెచ్1బీ వీసాలకు ట్రంప్ సర్కార్ విధించిన లక్ష డాలర్ల ఫీజు చట్టవిరుద్ధమంటూ అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుతో అనేక కంపెనీలకు ఊరట లభించినట్లయ్యింది. దీనిపై ప్రవాస భారతీయ సంఘాలు, డెమోక్రాట్లతో పాటు ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్ నేతలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ పరిణామాలు వీసాల జారీపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయన్న చర్చ జరుగుతోంది. అలాగే ఈ తీర్పుతో భారతీయులకు ప్రయోజనం ఎంతన్నది కూడా చర్చిస్తున్నారు. అమెరికా హెచ్-1బీ అనేది.. నాన్ ఇమిగ్రెంట్ వీసా. ప్రధానంగా ప్రత్యేక వృత్తుల్లో సాంకేతిక నైపుణ్యమున్న విదేశీయులను ఉద్యోగాల్లో నియమించుకోవటానికి యూఎస్ కంపెనీలను ఇది అనుమతిస్తుంది. అగ్రరాజ్యం ఏటా 65వేల మందికి ఈ వీసాలను జారీ చేస్తుంది. దీంతోపాటు అక్కడే మాస్టర్స్ చేసిన మరో 20వేల మందికి ఇవ్వాలనే నిబంధన ఉంది. అంటే మొత్తంగా ఏటా 85వేల హెచ్-1బీ వీసాలు జారీ అవుతుంటాయి. ఈ వీసాలు పొందినవారిలో దాదాపు 70శాతం మంది భారతీయులే ఉంటున్నారు. ఆ తర్వాత చైనా రెండో స్థానంలో ఉంది. సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసారు. విదేశీ ఉద్యోగులపై ఆధారపడకుండా కంపెనీలు అమెరికన్లను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఫీజును పెంచారు. దీంతో భారతీయులపై పెను ప్రభావమే పడింది. ఈ స్థాయిలో ఫీజును భరించలేక చాలా కంపెనీలు హెచ్-1బీ నియామకాలను తగ్గించాయి. ఈ ఫీజును సవాల్ చేస్తూ పలు న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే హెచ్-1బీ వీసా ఫీజులపై విచారణ జరిపిన బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు.. అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలపనందున దానిని చట్టవిరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ ఫీజు చెల్లబోదంటూ కీలక తీర్పు వెలువరించింది. దీంతో అమెరికా కంపెనీలపై తక్షణ ఆర్థికభారం తగ్గినట్లయ్యింది. అయితే, తీర్పు నేపథ్యంలో ఈ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తారా? అంటే కాదనే సమాధానమే వినిపిస్తోంది. బోస్టన్ కోర్టు తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ చేస్తామని వైట్‌హౌస్ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. అదే జరిగితే.. మరికొన్ని నెలల పాటు ఈ అంశం న్యాయస్థానాల్లో మగ్గనుంది. గతంలో కింది కోర్టు ఇచ్చిన తీర్పును ట్రంప్ సర్కారు అప్పీల్ చేసి గెలిచిన సందర్భాలూ ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే.. ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్టే..! ఈ తీర్పు వల్ల ఏటా ఇచ్చే హెచ్-1బీ కోటాలో ఎలాంటి మార్పు ఉండదు. వీసా వస్తుందన్న గ్యారెంటీ కూడా లేదు. కాకపోతే.. ప్రస్తుతానికి ఫీజు భారం తగ్గడంతో ఈ అవకాశాన్ని అమెరికా కంపెనీలు సద్వినియోగం చేసుకునే వీలుంది. ఇప్పటికే వృత్తి నిపుణుల కొరతతో సతమతమవుతున్న కంపెనీలు.. మళ్లీ విదేశీ ఉద్యోగుల నియామకాలు పెంచుకునే వీలుంది. సాధారణంగా వీరిలో అత్యధిక అవకాశాలు భారతీయులకే దక్కుతాయి కాబట్టి.. మనవాళ్లకు కొంతమేర ఉపశమనం లభించినట్లేనని వృత్తి నిపుణులు భావిస్తున్నారు. అయితే అనేక వివాదాస్పద నిర్ణయాలతో ట్రంప్ ప్రజలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఈ వీసా నిబంధనల కారణంగా అమెరికాకు వచ్చే వృత్తి నిపుణులకు కొరత ఏర్పడింది. ఈ క్రమంలో హెచ్-1బీ వీసా ఫీజుపై ట్రంప్ నిర్ణయాన్ని కొట్టివేస్తూ.. ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అమెరికా లోని ప్రవాస భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్ కి చెందిన చీఫ్ స్పందించారు. హెచ్-1బీ వీసా రుసుముపై ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ ఆధారిత వలసల వ్యవస్థపై స్థిరత్వాన్ని ఇది తిరిగి తీసుకొస్తుందన్నారు. అమెరికాలో సాంకేతిక, ఆరోగ్య సంరక్షణ, అధునాతన తయారీ రంగాల వృద్ధికి ప్రపంచంలోని ప్రతిభావంతులు అవసరమని ఇక్కడి నిపుణులు అభిప్రాయపడ్డారు. విధానపరమైన మార్పులు, చట్టబద్ధమైన అధికారం, ఆర్థిక గణాంకాలపై ఆధారపడి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇండియాస్పోరా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ జోషిపురా కోర్టు తీర్పుపై హర్షాతిరేకాలు తెలియజేశారు. అయితే, ట్రంప్ యంత్రాంగం ఈ విషయాన్ని ఇంతటితో ముగుస్తుందా.. లేదా అనే దానిపై అనుమానం వ్యక్తంచేశారు. ట్రంప్ యంత్రాంగానికి, న్యాయవ్యవస్థలకు మధ్య ఇటీవల జరిగిన పలు వివాదాలను ప్రస్తావించారు. చట్టానికి విరుద్ధంగా.. విధానపరమైన అంశాలతో అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసాదారుల కు మరిన్ని అడ్డంకులు సృష్టించవచ్చని హెచ్చరించారు. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం సంచలనం సృష్టించింది. ట్రంప్ నిర్ణయాన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈక్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు మాత్రమే దీనిపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పుపై ట్రంప్ యంత్రాంగం అప్పీల్ చేయనున్నట్లు తెలుస్తోంది.

# గ్రేట్ నికోబార్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం అనుమతి

## మలక్కా జలసంధికి అతిసమీపంలో జీఎన్ఐ ప్రాజెక్టు



**న్యూఢిల్లీ,జూన్ 9 (ప్రజావినికిడి):** గ్రేట్ నికోబార్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం అనుమతులు ఇచ్చింది. రూ.13వేల కోట్లతో పౌర-సైనిక విమానాశ్రయాన్ని నిర్మించనుంది. ఐఎన్ఎస్ బాజ్ వద్ద ఇప్పటికే ఉన్న నావికాదళ విమానాశ్రయాన్ని విస్తరించే ఆలోచనను పక్కనపెట్టింది. పర్యావరణపరంగా వైవిధ్యమైన ద్వీపంలో రూ.81వేల కోట్లతో ప్రకటించిన గ్రేట్ నికోబార్ ఐలాండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఇప్పటికే రాజకీయ దుమారం రేపుతోంది. ఈక్రమంలోనే ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం గమనార్హం. పౌర, సైనిక అవసరాలు తీరేలా గలాథియా బే సమీపంలోని చింగెన్ వద్ద ఈ ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించనున్నట్లు తెలుస్తోంది. భౌగోళిక పరిమితుల వల్ల ఇప్పటికే ఉన్న ఐఎన్ఎస్ బాజ్ ఎయిర్‌స్టేషన్ వద్ద రన్‌వేను విస్తరించేందుకు దీర్ఘకాలికంగా ఉన్న ప్రణాళికను పక్కనపెట్టాల్సి వచ్చింది. రానున్న ఐదేళ్లలో దీని నిర్మాణం పూర్తికావొచ్చని సమాచారం. నికోబార్ దీవి మలక్కా జలసంధికి అతిసమీపంలో ఉండటంతో జీఎన్ఐ ప్రాజెక్టు వ్యూహాత్మక ప్రాధాన్యం సంతరించుకుందని రక్షణరంగ వర్గాలు వివరించాయి. జలసంధికి సమీపంలోనే యుద్ధ నౌకలు, వైమానిక సదుపాయాలు ఉండటం నిఘాకు ఎంతో కీలకం కానుందన్నాయి. చైనాకు చెందిన 80 శాతం చమురు, 70 శాతం సహజవాయువు మలక్కా జలసంధి మీదుగా రవాణా అవుతుందని వెల్లడించాయి. రూ.81వేల కోట్ల గ్రేట్ నికోబార్ ఐలాండ్ (ఉఔఐ) డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కింద తలపెట్టిన మౌలిక సదుపాయాల్లో ఎయిర్‌పోర్ట్ ఒకటి. అండమాన్ నికోబార్ ఐలాండ్‌ను ఆర్థిక, వ్యూహాత్మక హబ్‌గా మార్చే లక్ష్యంతో కేంద్రం ఈ ప్రాజెక్ట్‌ను ముందుకుతీసుకువచ్చింది. ఈ ప్రాజెక్టును విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇది దేశ సహజ, గిరిజన వారసత్వ సంపదకు వ్యతిరేకంగా ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 160 చదరపు కిలోమీటర్ల మేర లక్షల చెట్లను నరికివేయాల్సి వస్తుందని, ఇది అభివృద్ధి అనే ముసుగులో జరుగుతున్న విధ్వంసమని మండిపడ్డారు.

# హెచ్1 బి వీసాపై ట్రంప్‌కు షాక్

## లక్ష డాలర్ల ఫీజుపై కోర్టు కొట్టివేత

**వాషింగ్టన్,జూన్ 9 (ప్రజావినికిడి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు షాక్ తగిలింది. హెచ్1బీ వీసాల కోసం ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించిన లక్ష డాలర్ల సుమారు రూ. 85 లక్షలకు పైగా భారీ ఫీజును అమెరికా ఫెడరల్ న్యాయస్థానం కొట్టేసింది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా చట్ట విరుద్ధమని బోస్టన్‌లోని యూఎస్ డిస్టిక్ట్ జడ్జి లియో సొరొకిన్ సోమవారం తీర్పు వెలువరించారు. విదేశాల్లో ఉంటూ అమెరికా తాత్కాలిక వలస వీసా హెచ్1బీకి ఎంపికైన వారు ఈ భారీ మొత్తాన్ని చెల్లించాలని గత సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం నిబంధన తీసుకురాగా.. దీనిని సవాలు చేస్తూ అమెరికాలోని 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన జడ్జి, అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు నేరుగా ఇలాంటి పన్నులపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేశారు. ఈ భారీ వసూలు పెనాల్టీ కాదని, చట్ట విరుద్ధమైన పన్ను అని ప్రకటిస్తూ ఆ నిబంధన చెల్లదని కొట్టిపారేశారు. కోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో ఐటీ సహా పలు రంగాలకు చెందిన వేలాది మంది విదేశీ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ టెక్కీలకు పెద్ద ఊరట లభించింది.

----------

# కాంగోను వణికిస్తున్న ఎబోలా

## ఇప్పటికే 101 మంది మృత్యువాత

**న్యూఢిల్లీ,జూన్ 9 (ప్రజావినికిడి):** మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ఈ వైరస్ కారణంగా ఇక్కడ ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం ఆందోళనను రేకెత్తిస్తోంది. ఈ మేరకు కాంగో ఆరోగ్య అధికారులు ఓ ప్రకటనను విడుదల చేశారు. ఆ ప్రకటన ప్రకారం.. కాంగోలో ఇప్పటివరకు 550కి పైగా ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. వారిలో 101 మంది ప్రాణాలు కోల్పోగా.. 19 మంది కోలుకున్నారు. మరో 309 మంది ఎబోలా అనుమానితులు ఐసోలేషన్‌లో ఉన్నారు. ఆదివారం ఒక్కరోజే ఇటురి, నార్త్ కిపులలో 35 కొత్త కేసులు నమోదవగా, మరో 10 మంది మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం వైరస్ తీవ్రత పెరుగుతోందని, కొన్నిరోజుల తర్వాత తీవ్రత తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. వ్యాధి నిర్ధరణ.. వైరస్‌కు సరైన టీకా, చికిత్స లేకపోవడం సవాళ్లుగా మారాయని తెలిపారు. కేసుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండొచ్చని భావిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (చఊఉక్ష) హెచ్చరికలు జారీ చేసింది. ప్రాంతీయంగా ఈ వ్యాధి మరింత వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇక, ఉగాండాలో 19 ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. కాగా.. రెండు మరణాలు చోటుచేసుకున్నాయి.

# వీణా విజయన్‌కు ఇడి నోటీసులు

## 12న కొచ్చిలో విచారణకు హాజరు కావాలని ఆదేశం



**తిరువనంతపురం,జూన్ 9 (ప్రజావినికిడి):**
సీఎమ్ఆర్ఎల్-ఎక్సాలాజిక్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్స్ కేసుకు సంబంధించి 'ది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూతురు వీణా విజయన్‌కు సమన్లు జారీ చేసింది. జూన్ 12వ తేదీన శు క్రవారం కొచ్చిలోని ఆఫీస్‌లో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. వీణా విజయన్‌తో పాటు 9మందికి ఈడీ సమన్లు జారీ చేసింది. పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌కు చెందిన ఐటీ కన్‌స్టలెన్సీ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్.. ప్రైవేట్ మైనింగ్ కంపెనీ అయిన సీఎమ్ఆర్ఎల్‌తో ఓ ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం కింద సీఎమ్ఆర్ఎల్ కంపెనీ.. వీణా విజయన్ కంపెనీకి 1.72 కోట్ల రూపాయల నుంచి 2.78 కోట్ల రూపాయల వరకు చెల్లించింది. అయితే, ఎక్సాలాజిక్ సొల్యూషన్స్.. సీఎమ్ఆర్ఎల్ కంపెనీకి ఎలాంటి ఐటీ సేవలు అందించకుండానే ఈ మొత్తాన్ని చెల్లించినట్లు దర్యాప్తులో తేలింది. ముఖ్యమంత్రితో ఉన్న కుటుంబ సంబంధాల వల్లే ఈ అక్రమ చెల్లింపులు జరిగాయని ఆదాయపు పన్ను శాఖ పేర్కొంది. నేపథ్యంలోనే సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ వీణా విజయన్‌పై కంపెనీల చట్టం కింద కేసు నమోదు చేసింది. అంతేకాదు.. ఈ నిధుల మళ్లింపుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీ లాండరింగ్ చట్టంకింద విచారణ చేపట్టింది. ఈ కేసులో ఈడీ విచారణను రద్దు చేయాలని కోరుతూ సీఎంఆర్ఎల్ సంస్థ కేరళం హైకోర్టును ఆశ్రయించింది. మే 26వ తేదీన విచారణ చేపట్టిన న్యాయస్థానం.. సీఎంఆర్ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కోర్టు తీర్పునిచ్చిన మరుసటి రోజే ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. తిరువనంతపురంలోని విజయన్ అద్దె ఇంటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 10 ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఇప్పుడు వీణా విజయన్‌కు నోటీసులు ఇచ్చారు.

# పీఓకేలో రక్తపాతం..

## పాక్‌పై అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవాలి: భారత్



**జూన్ 9 (ప్రజావినికిడి):**
పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని రావల్‌కోట్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘర్షణల్లో పౌరులు మరణించడంపై భారత్ తీవ్రంగా స్పందించింది. నిరసనకారులపై పాకిస్థాన్ సాగించిన అణచివేత చర్యలకు గానూ, ఆ దేశాన్ని అంతర్జాతీయ సమాజం జవాబుదారీని చేయాలని ఆశిస్తున్నట్లు భారత్ మంగళవారం పేర్కొంది. జూన్ 7, 8 తేదీల్లో రావల్‌కోట్‌లో భద్రతా బలగాలకు, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) మద్దతుదారులకు మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు జరిగాయి. ఈ హింసాకాండలో ఆరుగురు నిరసనకారులు, నలుగురు పోలీసులు, ఒక సామాన్య పౌరుడితో సహా 30 మంది

సరసమైన ధరలకు గోధుమ పిండి, విద్యుత్ సరఫరా చేయాలని, రాజకీయ హక్కులు కల్పించడంతో పాటు తమ ప్రాంతంపై చూపుతున్న వివక్షను అంతం చేయాలని డిమాండ్ చేస్తూ జేఏఏసీ అనే పౌర సమాజ కూటమి ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే నిరసనలు ఉద్రిక్తంగా మారి హింసకు దారితీశాయి. నిరసనకారులే ముందుగా కాల్పులు జరిపారని, అందుకే తాము ఆత్మరక్షణ కోసం స్పందించాల్సి వచ్చిందని పాకిస్థాన్ అధికారులు చెబుతున్నారు. అయితే, భద్రతా బలగాలే తమపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి ఊచకోతకు పాల్పడ్డాయని జేఏఏసీ నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియాలో మృతుల సంఖ్య 150 నుంచి 200 వరకు ఉండవచ్చని వదంతులు వ్యాపిస్తున్నప్పటికీ, ప్రభుత్వం కమ్యూనికేషన్ వ్యవస్థలపై ఆంక్షలు విధించడంతో వాస్తవాలను ధృవీకరించడం కష్టంగా మారింది. ఈ ఘటనపై బ్రిటన్‌లోని ప్రవాస కశ్మీరీలు పాకిస్థాన్ కాన్సులేట్ వద్ద నిరసనలు చేపట్టారు. ప్రస్తుతం పీఓకేలో బంద్ కొనసాగుతుండగా, ముజఫరాబాద్, భీంబర్, మీర్‌పూర్ వంటి ప్రాంతాల్లో పరిస్థితులు ఇంకా ఉద్రిక్తంగానే ఉన్నాయి.



# వైసీపీ 'శవ రాజకీయాలు' చేస్తోంది: మంత్రి నారాయణ

**విశాఖపట్నం జూన్ 9 (ప్రజావినికిడి):**
విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ దుర్ఘటనపై కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించిందని మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనవాణి గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొన్న ఆయన, ఈ ప్రమాదం నేపథ్యంలో తాను తిరుపతిలో పాల్గొనాల్సిన అధికారిక కార్యక్రమాన్ని కూడా రద్దు చేసుకున్నట్లు వివరించారు. బాధితులకు మెరుగైన వైద్యం, తక్షణ సహాయక చర్యలు అందించడంపైనే ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ ఘటనను పర్యవేక్షిస్తున్నారని నారాయణ పేర్కొన్నారు. అయితే, ఈ విషాదాన్ని ఆసరాగా చేసుకుని వైసీపీ దారుణమైన శవ రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ప్రజలను రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోవాలని హితవు పలికిన ఆయన, 2029 ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు మళ్లీ తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇక గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన 56 ఫిర్యాదుల్లో 60 శాతానికి పైగా రెవెన్యూ సమస్యలే ఉన్నాయని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకల వల్లే ప్రజలు నేటికీ ఇబ్బందులు పడుతున్నారని, వీటి పరిష్కారానికి మంత్రుల కమిటీ పనిచేస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు వారానికోసారి దీనిపై సమీక్ష నిర్వహిస్తున్నారని, వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

# విలేకరిపై హర్మన్‌ప్రీత్ కౌర్ తీవ్ర ఆగ్రహం



జూన్ 12 నుంచి ఇంగ్లాండ్ వేదికగా మహిళల టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుంది. ఈ టోర్నీకి ముందు జరిగిన ప్రెస్ మీట్‌లో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. "ఇది మీకు చివరి ప్రపంచకప్ అవుతుందా" అని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు.. "నేను తప్పుకోవాలని మీరు కోరుకుంటున్నారా" అంటూ ఎదురు ప్రశ్న వేశారు. 2025 వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత్, ఈ టోర్నీలోనూ అంచనాలతో బరిలోకి దిగుతోందని, ఒత్తిడిని అధిగమించి రాణిస్తామని హర్మన్ ధీమా వ్యక్తం చేశారు. మరో నాలుగు రోజుల్లో మహిళల టీ20 ప్రపంచకప్ ప్రారంభం కానుంది. జూన్ 12 నుంచి ఇంగ్లాండ్ వేదికగా ఈ టోర్నీ జరగనుంది. ఇందుకోసం ఇప్పటికే ఈ టోర్నీలో పాల్గొనే 12 జట్లూ అక్కడికి చేరుకుని.. సన్నాహకాలు ప్రారంభించాయి. హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా సైతం ముమ్మర సాధన చేస్తోంది. అయితే టోర్నీ ప్రారంభానికి ముందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్.. ఓ దశలో ఆగ్రహానికి గురయ్యారు. విలేకరి వేసిన ప్రశ్నకు ఆమె ఎదురు ప్రశ్న వేశారు. ఈ ప్రెస్ మీట్‌లో ఓ విలేకరి.. "ఈ టీ20 ప్రపంచకప్ మీకు చివరిది అవుతుందా" అని ప్రశ్నించాడు. ఈ ప్రశ్న హర్మన్‌కు కోపం తెప్పించింది. వెంటనే ఆమె.. "నేను తప్పుకోవాలని మీరు కోరుకుంటున్నారా" అని ఎదురు ప్రశ్న వేశారు. దీనికి సదరు విలేకరి బదులిస్తూ.. "మీ భవిష్యత్ ప్రణాళికల గురించి తెలుసుకునేందుకే ఈ ప్రశ్న అడిగా. టీ20 ఫార్మాట్ నుంచి తప్పుకునేందుకు టైమ్ కాలేదని మీరు భావిస్తున్నందుకు సంతోషిస్తున్నా" అని అన్నారు. అయినా.. హర్మన్ ప్రీత్ కౌర్ కోపం మాత్రం తగ్గలేదు.

"మరి అలాంటప్పుడు ఈ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారు" అని మరోసారి ఎదురు ప్రశ్న వేశారు.కాగా మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో భారత్ విజేతగా నిలిచింది. భారత్ వేదికగా జరిగిన ఈ టోర్నీలో టీమిండియా విజేతగా నిలిచింది. దీంతో ఈ టోర్నీలోనూ భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో ఈ విషయంపై కూడా హర్మన్ మాట్లాడారు. "వన్డే ప్రపంచకప్ తర్వాత మాపై సహజంగానే అంచనాలు వస్తాయి. ఒక రకంగా మహిళల క్రికెట్‌కు ఇది సానుకూల అంశం. వ్యక్తిగతంగా నేను బయటి నుంచి వచ్చే ఒత్తిడి గురించి ఆలోచించకుండా.. ఉండేందుకే ప్రయత్నిస్తా. ప్రస్తుతం ఏం చేయాలనేదానపైనే నా ఫోకస్ ఉంటుంది" అని హర్మన్ ప్రీత్ కౌర్ వ్యాఖ్యానించారు. ఈ టోర్నీలో పాల్గొనే మొత్తం 12 జట్లను రెండు గ్రూప్‌లు విభజించి మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. గ్రూప్-1లో భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ నెదర్లాండ్స్. గ్రూప్-2లో ఇంగ్లండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్, శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్ జట్లు ఉన్నాయి.

# టీమ్‌ఇండియా నుంచి సిరాజ్‌ను తప్పించిన బీసీసీఐ



టీమ్‌ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ విషయంలో బీసీసీఐ అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో టీ20 జట్టుకు ఇటీవల సిరాజ్‌ను ఎంపిక చేసింది. అయితే తాజాగా ఆ సిరీస్‌ల నుంచి సిరాజ్‌ను తప్పించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా అతడికి విశ్రాంతి కల్పించింది. అలాగే ఈ సిరీస్‌ల్లో అతడి స్థానాన్ని ప్రసిద్ధ్ కృష్ణతో భర్తీ చేయనున్నట్లు పేర్కొంది. ఆ మేరకు అధికారికంగా ఓ ప్రకటన చేసింది. 'బీసీసీఐ వైద్య బృందం, టీమ్ యాజమాన్యం మధ్య జరిగిన చర్చల అనంతరం 'వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్'లో భాగంగా సిరాజ్‌కు కొంతకాలం విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. సుదీర్ఘమైన అంతర్జాతీయ సీజన్‌కు ముందు అతను పూర్తిగా కోలుకునేలా చూసేందుకు, ముందుజాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నారు' అని బీసీసీఐ స్టేట్‌మెంట్‌లో పేర్కొంది. తాజాగా అఫ్గాన్‌తో ముగిసిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో సిరాజ్ ప్రదర్శన పేలవంగా ఉంది. ఈ టెస్టులో అతడు తొలి ఇన్నింగ్స్‌లో 9 ఓవర్లు బౌలింగ్ చేసినా వికెట్ దక్కలేదు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి 1 వికెట్ పడగొట్టాడు. కాగా, రీసెంట్‌గా జరిగిన టీజీ 20 క్రికెట్ లీగ్ వేలంలో మహ్మద్ సిరాజ్ భారీ ధర దక్కించుకున్నాడు. అతడిని వేలంలో రూ.14 లక్షలకు వరంగల్ వారియర్స్ కొనుగోలు చేసింది. ఈ వేలంలో అతడిది మూడో అత్యధిక ధర కావడం విశేషం. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లకు భారత జట్టు : శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, ప్రసిద్ధ్ కృష్ణ

# సెంచరీతో మెరిసిన రుతురాజ్ గైక్వాడ్




శ్రీలంక వేదికగా జరుగుతున్న ట్రై నేషనల్ ఏ సిరీస్‌లో రుతురాజ్ గైక్వాడ్ సెంచరీతో మెరిశాడు. ఐపీఎల్‌లో విధ్వంసం సృష్టించి నేషనల్ టీమ్‌లో సెలెక్ట్ అయిన వైభవ్ సూర్యవంశీ కేవలం 14 పరుగులకే అవుట్ కాగా.. రుతురాజ్ గైక్వాడ్ 101 పరుగులు చేశాడు. కెప్టెన్ తిలక్ వర్మ 60 పరుగులు చేయడంతో భారత్ - ఏ జట్టు 50 ఓవర్లలో 277/6 పరుగులు చేసింది. శ్రీలంక - ఏ విజయం సాధించాలంటే 278 పరుగులు చేయాల్సి ఉంది.ట్రై నేషనల్ ఏ సిరీస్‌లో ఐపీఎల్ విధ్వంసకర బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ నిరాశ పరిచాడు. ఐపీఎల్‌లో తన బ్యాట్‌తో విధ్వంసం సృష్టించిన ఈ 15 ఏళ్ల బుల్లి డైనమైట్ ఇంటర్నేషనల్‌లో తడబడ్డాడు. శ్రీలంక - ఏతో జరిగిన మ్యాచ్‌లో మూడు బౌండరీలు బాది 14 పరుగులకే పెవిలియన్ బాట పట్టాడు. రుతురాజ్ గైక్వాడ్ మాత్రం తన క్లాస్ ఇన్నింగ్స్‌తో సెంచరీ బాదాడు. శ్రీలంకలోని దంబుల్లా వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇండియా - ఏ కెప్టెన్ తిలక్ వర్మ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఐపీఎల్‌లో రాణించిన వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, ప్రియాన్ష్ ఆర్య, ఆయుష్ బదోని ఉన్న యువ జట్టుపై భారీ అంచనాలే ఉన్నాయి. ప్రభ్‌సిమ్రాన్ సింగ్ - వైభవ్ సూర్యవంశీ ఓపెనర్లుగా వచ్చిన ఈ మ్యాచ్‌లో భారత్ ఆరంభంలోనే వికెట్ కోల్పోయింది. నాలుగో ఓవర్‌లో ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ 12 బంతుల్లో 14 పరుగులు చేసి వికెట్ కోల్పోయాడు. ఆ వెంటనే 11 బంతుల్లో 2 పరుగులు మాత్రమే చేసిన ప్రభ్‌సిమ్రాన్ సింగ్ పెవిలియన్ బాట పట్టాడు. దాంతో భారత్ 16 పరుగులకే ఓపెనర్లు ఇద్దర్నీ కోల్పోయింది. ప్రియాన్ష్ ఆర్య - రుతురాజ్ గైక్వాడ్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లారు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 53 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 32 బంతుల్లో నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 32 పరుగులు చేసిన ప్రియాన్ష్ రనౌట్ అయ్యాడు. దాంతో భారత్ 69 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయింది. మిడిలార్డర్‌లో వచ్చిన కెప్టెన్ తిలక్ వర్మ - రుతురాజ్ గైక్వాడ్ మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు ఏకంగా 150 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలోనే రుతురాజ్ గైక్వాడ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 114 బంతులు ఆడిన గైక్వాడ్ ఆరు ఫోర్లు, మూడు సిక్సర్లతో 101 పరుగులు చేసి అవుటయ్యాడు. ఆ వెంటనే 97 బంతుల్లో 60 పరుగులు చేసి తిలక్ వర్మ కూడా వికెట్ కోల్పోయాడు. ఆఖర్లో ఆయుష్ బదోనీ 18 బంతుల్లో 24, సూర్యాన్ష్ షెడ్గే 14 బంతుల్లో 26 పరుగులు చేయడంతో భారత్ 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. శ్రీలంక బౌలర్లలో మొహమ్మద్ షిరాజ్ రెండు వికెట్లు పడగొట్టగా, చమీకా కరుణ రత్నే ఒకటి, గరుక సంకేత ఒకటి, వాంజ సహాన్ ఒక వికెట్ తీసుకున్నారు.



# సన్‌రైజర్స్‌లు కొత్త హెడ్ కోచ్!!

ఐపీఎల్ 2027 సీజన్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్య మారన్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది జరిగే ఐపీఎల్ కోసం కొత్త హెడ్ కోచ్‌ను నియమించాలనే ఆలోచనలో కావ్య మారన్ ఉందని జట్టు వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుత హెడ్ కోచ్ డానియల్ వెటోరి పనితీరు పట్ల సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే తదుపరి సీజన్ ప్రారంభానికి ముందే డానియల్ మెటోరిపై వేటు వేసి కొత్త హెడ్ కోచ్‌ను నియమించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే అనుభవజ్ఞుడైన భారతీయ కోచ్‌తో చర్చలు జరుపుతోందని, ఈ వ్యవహారంపై ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని జట్టుకు చెందిన ఓ అధికారి మీడియాకు తెలిపారు.ఐపీఎల్ 2024 సీజన్‌కు ముందు బ్రియాన్ లారా స్థానంలో డానియల్ వెటోరి సన్‌రైజర్స్ హైదరాబాద్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతని పర్యవేక్షణ, ప్యాట్ కమిన్స్ అద్భుతమైన సారథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆ సీజన్ ఫైనల్ చేరింది. కానీ తుది పోరులో కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో ఓడి టైటిల్‌ను చేజార్చుకుంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో మాత్రం తీవ్రంగా నిరాశపర్చింది. ప్లే ఆఫ్స్ చేరకుండా ఆరో స్థానంలో నిలిచింది. తాజా సీజన్‌లో అద్వితీయమైన ప్రదర్శన కనబర్చిన సన్‌రైజర్స్ హైదరాబాద్..

# మరోసారి వివాదాల్లో బెన్ స్టోక్స్



ఇంగ్లాండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ మరోసారి వివాదాల్లో చిక్కుకున్నాడు. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు నిబంధనలు ఉల్లంఘించి అర్ధరాత్రి నైట్‌క్లబ్‌కు వెళ్లాడు. అంతేకాకుండా నడిరోడుపై ఓ వ్యక్తితో గొడవపడ్డాడు. ఇది ఘర్షణకు దారి తీసింది. ఒకరినొకరు దాడి చేసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇది ఈబీసీ దృష్టిలో పడింది. దీంతో అతడిపై బోర్డు చర్యలు తీసుకునే అవకాశం ఉంది. న్యూజిలాండ్ జట్టు ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉంది. ఈ టూర్‌లో ఇరుజట్లు 3 టెస్టులు ఆడాల్సి ఉంది. ఇందులో భాగంగా రీసెంట్‌గా లార్డ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఇంగ్లాండ్ విజయం సాధించింది. అయితే ఈ సిరీస్ నేపథ్యంలో ఆటగాళ్లు లేట్ నైట్ సమయాల్లో బయటకు వెళ్లడాన్ని నిషేధించింది. కానీ కెప్టెన్ స్టోక్స్‌తో సహా బౌలర్ గస్ అట్కిసన్ గత ఆదివారం నిబంధనలు ఉల్లంఘించి లండన్‌లోని ఓ నైట్‌క్లబ్‌కు వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా ఈ ఇద్దరు క్రికెటర్లు సారాసెన్స్ అకాడమీకి చెందిన రగ్బీ ఆటగాడితో వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో ఈ వివాదం ఘర్షణకు దారితీసింది.

# పాక్‌లో తుపాకుల మధ్య ఆడాం..
# భారత్‌లో ఆడలేమా..?

### - బంగ్లాదేశ్ టీ20 కెప్టెన్ లిటన్ దాస్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ బహిష్కరించడం పూర్తిగా బోర్డు పెద్దల నిర్ణయమేనని బంగ్లాదేశ్ టీ20 కెప్టెన్ లిటన్ దాస్ స్పష్టం చేశాడు. ఇందులో ఆటగాళ్ల పాత్ర ఏ మాత్రం లేదని చెప్పాడు. అధికారులను ఎంత కన్విన్స్ చేసినా వినలేదని తెలిపాడు.భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026ను బంగ్లాదేశ్ బహిష్కరించిన సంగతి తెలిసిందే. భద్రతాపరమైన కారణాలను సాకుగా చూపుతూ ఈ నిర్ణయం తీసుకుంది. ఐసీసీ ఎంత సర్ది చెప్పడానికి ప్రయత్నించినా.. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు మొండి పట్టును వీడలేదు. పాక్ క్రికెట్ బోర్డును చూసుకొని భారత్‌తో కయ్యానికి దిగింది.తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యవహారంపై స్పందించిన లిటన్ దాస్.. ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. భారత్‌లో భద్రత లేదని చెప్పడం సరైన కారణం కాదని అభిప్రాయపడ్డాడు. పాకిస్థాన్‌లో తాము తుపాకుల మధ్య మ్యాచ్‌లు ఆడిన రోజులు ఉన్నాయని గుర్తు చేసుకున్నాడు.'బోర్డు పెద్దలు మాకు భారత్‌లో భద్రత లేదని చెప్పారు. అప్పుడు మేం వారితో మేమంతా పాకిస్థాన్‌లో తుపాకుల మధ్య ఆడాం కదా ఇంతకన్నా ప్రమాదకరమైన పరిస్థితులు ఇంకేముంటాయి. పాకిస్థాన్‌లో ఆడినప్పుడు భారత్‌లో ఎందుకు ఆడలేం అని అధికారులను మేం నిలదీసాం.'అని లిటన్ దాస్ చెప్పుకొచ్చాడు.అయితే ఇదే వ్యవహారంపై లిటన్ దాస్ గతంలో భిన్నమైన వ్యాఖ్యలు చేశాడు. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ.. 'మేం ప్రపంచకప్ ఆడుతామని మీరు అనుకుంటున్నారా నాకు, నా జట్టుకు క్లారిటీ లేదు. నేనైతే సమాధానం చెప్పను. మీరు ఏం ప్రశ్న అడగాలనుకుంటున్నారో నాకు తెలుసు. దానికి సమాధానం చెప్పడం నాకు సురక్షితం కాదు'అని అన్నాడు. ఆటగాళ్లు, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సంయుక్తంగా టీ20 ప్రపంచకప్ ఆడకూడదని నిర్ణయించుకున్నాయని ఆ దేశ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ అప్పట్లో మీడియాకు తెలిపారు. తాజాగా ఈ వాదనను లిటన్ దాస్ తోసిపుచ్చాడు. ఇది ఏకాభిప్రాయంతో తీసుకున్న నిర్ణయం కాదన్నాడు. ఆటగాళ్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోలేదని వాపోయాడు.ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను ఐపీఎల్ నుంచి తొలగించడంతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ప్రతీకార చర్యకు దిగింది. తమ టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని కోరింది. ఈ విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. ఇదే అవకాశంగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు.. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డును రెచ్చగొట్టింది. చివరకు ఐసీసీ అంగీకరించకపోవడంతో టోర్నీ నుంచి తప్పుకుంది. దాంతో ఐసీసీ.. బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌కు ప్రపంచకప్ ఆడే అవకాశం కల్పించింది.

# అవకాశం ఇప్పించాలని క్రిస్ గేల్ నన్ను బతిమాలాడాడు

### - ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ సంచలన వ్యాఖ్యలు

వెస్టిండీస్ విధ్వంసకర వీరుడు, యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ తన సాయం కోరాడని ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ తెలిపారు. ఐపీఎల్ 2011 వేలంలో క్రిస్ గేల్ అన్ సోల్డ్ కావడంతో.. అవకాశం ఇప్పించాలని తనను బతిమాలాడని లలిత్ మోదీ గుర్తు చేసుకున్నారు. తనకు చాలా అప్పులు ఉన్నాయని, వాటిని తీర్చాలంటే ఐపీఎల్ ఆడటమే తన ముందున్న ఏకైక మార్గమని గేల్ రిక్వెస్ట్ చేశాడని లలిత్ మోదీ చెప్పుకొచ్చారు.ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్‌కు చెందిన 'ది ఓవర్‌లాప్ క్రికెట్'షోలో లలిత్ మోదీ ఈ విషయాలను పంచుకున్నారు. 'అది 2011 నాటి మాట. నాకింకా గుర్తుంది. నేను అప్పుడే ఐపీఎల్ నుంచి బయటకు వచ్చి లండన్‌లో సెటిల్ అవుతున్నాను. నాకు మంచి ఫ్రెండ్ అయిన క్రిస్ గేల్‌ను ఐపీఎల్ 2011 వేలంలో ఏ జట్టు కొనుగోలు చేయలేదు. అప్పుడు అతని నుంచి నాకు ఫోన్ కాల్ వచ్చింది. 'వేలంలో నన్ను ఎవరూ కొనుగోలు



చేయలేదు'అని గేల్ నాతో అన్నాడు. అయితే గేల్ అప్పటి వరకు సరిగ్గా రాణించలేదు. ఐపీఎల్ అంటేనే అత్యుత్తమ ప్రదర్శన కనబరచడం. అంతకుముందు అతను కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఆడాడు. ఆ జట్టు తరపున అతను సరిగ్గా ఆడలేదు. ఈ లీగ్‌లో అతను కొంచెం బద్ధకించాడు. అప్పుడు గేల్ నాతో..

'నాకు చాలా అప్పులు ఉన్నాయి, నా బిల్లులు చెల్లించుకోవడానికి నాకు ఈ అవకాశం చాలా అవసరం' అని రిక్వెస్ట్ చేశాడు.ఆ తర్వాత నేను ఒకరిద్దరికి ఫోన్లు చేశాను. అందరూ క్రిస్ గేల్‌ను వద్దన్నారు. దాంతో నేను మా రోడ్డుకు అవతలివైపు ఉన్న విజయ్ మాల్యా ఇంటికి వెళ్లాను. విజయ్.. క్రిస్ గేల్‌కు ఒక అవకాశం ఇవ్వమని చెప్పాను. దానికి ఆయన.. 'నా దగ్గర ఒక స్థానం ఖాళీగా ఉంది. కానీ అతను బాగా రాణిస్తేనే నేను డబ్బులు చెల్లిస్తాను' అని అన్నాడు.'అని లలిత్ మోదీ చెప్పుకొచ్చారు.ఆ సీజన్‌లో ఆస్ట్రేలియా-డచ్ క్రికెటర్ డిర్క్ నన్నెస్ స్థానంలో ఇంజ్యూరీ రిప్లేస్‌మెంట్‌గా ఆర్‌సీబీలోకి వచ్చిన క్రిస్ గేల్ విధ్వసంకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. 12 ఇన్నింగ్స్‌ల్లో 67.55 సగటు, 183.13 స్ట్రైక్‌రేట్‌తో 608 పరుగులు చేశాడు. రెండు శతకాలు నమోదు చేసిన గేల్.. తన పాత ఫ్రాంచైజీ కేకేఆర్‌పై 55 బంతుల్లో 102 నాటౌట్ అజేయ శతకంతో చెలరేగాడు. జట్టులో ప్రధాన ఆటగాడిగా మారిపోయిన గేల్.. 2013లో అత్యధిక వ్యక్తిగ స్కోర్ 175 నాటౌట్ నమోదు చేశాడు. ప్రపంచవ్యాప్తంగా జరిగే ఫ్రాంచైజీ లీగ్‌ల్లో మొత్తం 35 టీమ్స్ తరపున బరిలోకి దిగి 14562 పరుగులు చేశాడు. ఇందులో 22 శతకాలతో పాటు 88 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఐపీఎల్‌లో కేకేఆర్, ఆర్‌సీబీతో పాటు పంజాబ్ కింగ్స్‌కు ప్రాతినిథ్యం వహించిన గేల్.. 142 మ్యాచ్‌ల్లో 148.96 స్ట్రైక్‌రేట్‌తో 4965 పరుగులు చేశాడు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# వివాదాస్పద సన్నివేశాలు తొలగించాం

## పెద్ది డైరెక్టర్ బుచ్చిబాబు వెల్లడి



'పెద్ది'లో వివాదాస్పదమైన సన్నివేశాలను తొలగించినట్లు దర్శకుడు బుచ్చిబాబు వెల్లడించారు. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతున్నప్పటికీ ఇందులోని కొన్ని సన్నివేశాలపై సోషల్ మీడియాలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవల క్షమాపణలు చెప్పిన బుచ్చిబాబు ఆయా సన్నివేశాలను తొలగిస్తామని చెప్పారు. వాటిని తొలగించినట్లు తాజాగా తెలిపారు. ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీనిపై వివరణ ఇచ్చారు. 'చాలా మంది ఇలాంటి మంచి కథలో జాన్వీ కపూర్ ట్రాక్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారు. సినిమాకు ఆ పాత్ర అనవసరమని కామెంట్ చేశారు. నా గత సినిమాతో (ఉప్పెన) పోలిస్తే 'పెద్ది' కథను నేను పూర్తి భిన్నంగా రాసుకున్నా. కొండల ప్రాంతంలో మారుమూల గ్రామం నుంచి వచ్చిన వ్యక్తి పెద్ది. మొదట అతడిలో మొరటుతనాన్ని చూపించి.. సినిమా చివరిలో దాన్ని సరిదిద్దాలని భావించాను. అతడు పెరిగిన వాతావరణం వల్ల అలా ఉన్నాడని.. అతడు మారడానికి అమ్మాయి ప్రేమ కూడా ఓ కారణం కావాలని ఆమె పాత్రను రాశాను. అయితే, స్క్రీన్‌ప్లేలో కొన్ని సన్నివేశాలు అపార్థానికి దారితీశాయి. దీంతో అందరూ ఆ పాత్రను తప్పుగా అర్థం చేసుకున్నారు. విడుదల అనంతరం వచ్చిన విమర్శలను మేం పరిగణనలోకి తీసుకున్నాం. ఆ సన్నివేశాలను గుర్తించి సినిమా నుంచి తొలగించాం అని బుచ్చిబాబు వివరించారు. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో పెద్దిగా రామ్ చరణ్ తన నటనతో మెప్పించారు. ఆయనకు జోడీగా జాన్వీకపూర్ అచ్చియమ్మ పాత్రలో కనిపించారు. ఆమె పాత్రను గ్లామర్‌కే పరిమితం చేశారని పరిచయ సన్నివేశాల్లోనూ ఆమెను చూపిన విధానంపై విమర్శలు వచ్చాయి. ఈ వివాదం పక్కన పెడితే జూన్ 4న విడుదలైన ఈ చిత్రం ఇప్పటి వరకూ రూ.315 కోట్లు రాబట్టింది. అయితే, ఈ సినిమాలో జాన్వీ కపూర్ సీన్స్ తో పాటు సెకండాఫ్ లో కొన్ని పాత్రల ఎండింగ్ సరిగా లేదని కొద్దీ రోజులుగా విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రేక్షకుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా చిత్ర బృందం ఈ సినిమాలో కొన్ని కీలక మార్పులు చేయబోతున్నారు. తాజా సమాచారం ప్రకారం.. 'పెద్ది' సినిమా లెంత్, అలాగే కొన్ని సీన్స్ విషయంలో వస్తున్న మిశ్రమ స్పందనను దృష్టిలో ఉంచుకుని మేకర్స్ కొన్ని సీన్లను డిలీట్ చేసి, మరికొన్ని కొత్త సీన్లను జత చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా సెకండాఫ్ లో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్ పోషించిన 'గౌరినాయుడు' ఎ÷-లాష్‌బ్యాక్ సీన్స్‌ను కొన్నింటిని తొలగించనున్నారట. ఈ సీన్స్ సినిమా ఎ÷-లోను కాస్త నెమ్మదించేలా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అభిమానులకు సర్ప్రైజ్ ఇస్తూ రామ్ చరణ్, జగపతి బాబుల మధ్య ఉండే మరికొన్ని కీలకమైన సీన్లను యాడ్ చేయబోతున్నారట. ఈ మార్పులన్నింటినీ పూర్తి చేసిన తర్వాత చిత్ర యూనిట్ ఈ కొత్త వర్షన్‌ను మళ్లీ సెన్సార్ చేసి థియేటర్లలో పాత వర్షన్ ను తీసేసి, ఈ కొత్త వెర్షన్‌ను అప్‌లోడ్ చేయనున్నారు. ఈ సరికొత్త మార్పులతో ఫుట్ ఫాల్స్ పెరుగుతాయని టీమ్ భావిస్తోంది.



# కింగ్ నాగార్జున వందో మూవీ

## సైలెంట్‌గా షూటింగ్ పూర్తి చేస్తున్న చిత్ర బృందం

టాలీవుడ్ కింగ్ నాగార్జున నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. 'కింగ్ 100', 'లాటరీ కింగ్' అనే వర్కింగ్ టైటిల్స్‌తో ప్రచారంలో ఉన్న ఈ మైల్‌స్టోన్ చిత్రానికి రా.కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ సైలెంట్‌గా దూసుకుపోతోంది. అంతేకాదు.. షూటింగ్ దాదాపుగా చివరి దశకు చేరుకున్నట్టుగా టాక్. త్వరలోనే చిత్రీకరణ మొత్తాన్ని పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనుల పై ఫోకస్ చేసేందుకు చిత్ర యూనిట్ ఎ÷-లాన్ చేస్తోందట. మరోవైపు మ్యూజిక్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతోందట. వచ్చే నెలలోనే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసే ఆలోచనలో కూడా ఉన్నారట. అంతేకాదు.. అన్ని అనుకున్నట్టుగా జరిగితే ఈ ల్యాండ్‌మార్క్ మూవీని 2026 దసరా పండుగ కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట. కానీ, ఇప్పటి వరకు అఫీషియల్ అనౌన్స్మెంట్ మాత్రం రాలేదు. అసలు ఈ సినిమా టైటిల్ ఏంటి? నాగార్జున లుక్ ఎలా ఉంటుంది

# రామ్‌చరణ్ నటన మైండ్ బ్లోయింగ్

### జగపతి బాబు పాత్ర అద్భుతంగా ఉంది

### పెద్దిపై బన్నీ ప్రశంసలు



వివాదాల నడుమ బాక్సాఫీస్ దగ్గర దూసుకుపోతున్న 'పెద్ది'పై ప్రశంసలు కూడా పెద్ద ఎత్తున విన్పిస్తున్నాయి. ఇలాంటి టైమ్ లో అల్లు అర్జున్ చేసిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో రచ్చ చేస్తోంది. సినిమా విడుదలై ప్రేక్షకుల నుంచి స్పందన వస్తున్న వేళ, స్వయంగా సినిమా చూసిన బన్నీ తన అభిప్రాయాన్ని పంచుకోవడం ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. 'పెద్ది' చూసిన తర్వాత రామ్ చరణ్ నటన గురించి అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలు మెగా అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బన్నీ తన పోస్ట్ లో చరణ్ పర్ఫార్మెన్స్ మైండ్ బ్లోయింగ్ గా ఉందని చెప్పారు, అలాగే చెర్రీ పెద్ది పాత్రలో ఇంటెన్స్ గా, సహజంగా, అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్ఫర్మేషన్ తో ఆకట్టుకున్నాడని, డ్యాన్స్ లో కనిపించిన గ్రేస్ అన్నీ కలిసి ఒక పూర్తి స్థాయి నటుడిగా చరణ్ ను మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. ప్రతి అంశంలోనూ చరణ్ అద్భుతంగా రాణించాడని, ప్రస్తుతం అతడికి వస్తున్న ప్రశంసల్లో ప్రతి ఒక్కటి అతడు సంపాదించుకున్నవేనని చెప్పారు. తన సోదరుడి విజయాన్ని చూసి గర్వంగా ఉందని కూడా అల్లు అర్జున్ పేర్కొన్నారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన జగపతి బాబు గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన నటన బలంగా నిలిచిందని చెప్పారు. అలాగే జాన్వీ కపూర్ తో పాటు మిగతా నటీనటులందరికీ అభినందనలు తెలియజేశారు. తెరపై కనిపించే నటీనటులే కాదు, సినిమా కోసం కష్టపడిన టెక్నీషియన్స్, నిర్మాతలు కూడా ప్రశంసలకు అర్హులని చెప్పారు. అయితే అల్లు అర్జున్ పోస్ట్ లో మరో ముఖ్యమైన అంశం దర్శకుడు బుచ్చిబాబు సానాపై చేసిన ప్రశంసలు. ప్రతి పాత్రను ఎలివేట్ చేస్తూనే రామ్ చరణ్ పాత్రను మరింత ఎత్తుకు తీసుకెళ్లినందుకు దర్శకుడికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# పెంపుడు కుక్కను మట్టుపెట్టిన దుర్మార్గుడు కన్నీరు పెట్టుకున్న నటి మంజరి ఫడ్నీస్

తాన

అపార్ట్‌మెంట్‌లో ఉండే ఓ కుక్కను విచక్షణారహితంగా కొట్టి చంపేశారంటూ నటి మంజరి ఫడ్నీస్ ఆవేదన వ్యక్తంచేశారు. 2019లో తమ సొసైటీలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ కుక్కని వదిలివెళ్లారని అప్పటినుంచి దాన్ని 'మైకీ' అని పేరుతో తామే పెంచుకుంటున్నట్లు తెలిపారు. కొన్ని రోజుల నుంచి అది కనిపించకపోవడంతో పోస్టర్లు కూడా వేసి వెతికామని.. ఈ క్రమంలో సొసైటీకి చెందిన ఓ వ్యక్తి అత్యంత కిరాతకంగా దాన్ని కొట్టి చంపేశారని ఆరోపించారు. భవిష్యత్తులో ఇలా ఎవరూ జంతుహింసకు పాల్పడకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని మంజరి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఆమె విలపిస్తూ మాట్లాడుతున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. భూమి పెడ్నేకర్‌తో పాటు మరికొందరు దీనిపై స్పందించారు. 2004లో ఓ హిందీ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మంజరి అల్లరి నరేశ్‌తో కలిసి 'సిద్ధూ ఫ్రమ్ శ్రీకాకుళం', 'శుభప్రదం' చిత్రాల్లో నటించారు. అలాగే ఎన్టీఆర్ హీరోగా వచ్చిన 'శక్తి'లో గౌరిగా కనిపించారు.

-------





# దేశ విభజన ఆధారంగా .. బట్వారా 1947

బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా చిత్రం నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఇప్పటివరకు 'లాహోర్ 1947' అనే వర్కింగ్ టైటిల్‌తో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా పేరును అధికారికంగా 'బట్వారా 1947' గా మారుస్తూ చిత్రబృందం సరికొత్త మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే ఈ భావోద్వేగభరితమైన చిత్రాన్ని స్వాతంత్య్ర దినోత్సవ కానుకగా 2026, ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘాతక్' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం.




# ఆయన నటన గురించి మాటల్లో చెప్పలేను: సంయుక్త మీనన్

మలయాళం, తెలుగు చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న నటి సంయుక్త మీనన్, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతిపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆయనతో కలిసి 'స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్' చిత్రంలో నటిస్తున్న ఆమె, విజయ్ నటనను ప్రత్యక్షంగా చూడటం ఒక అద్భుతమైన అనుభూతి అని తెలిపారు. ఆయన సెట్‌లో ఉన్నప్పుడు, తెరపై చూసేదానికంటే భిన్నమైన శక్తిని తీసుకొస్తారని ఆమె అభిప్రాయపడ్డారు.విజయ్ సేతుపతితో కలిసి పనిచేయడం గురించి సంయుక్త మాట్లాడుతూ, "నేను విజయ్ సర్‌కు పెద్ద అభిమానిని. ఆయన నటనను దగ్గర నుంచి చూడటం మాటల్లో చెప్పలేను. ఒక పాత్రలోకి ఆయన మారే తీరు చాలా సహజంగా ఉంటుంది. డైలాగ్స్ చెబుతుంటే, అవి నిజంగా తనలో నుంచే వస్తున్నట్లు అనిపిస్తుంది. ఒక సహనటిగా ఆ ప్రక్రియను చూడటం నాకు దక్కిన అదృష్టం" అని వివరించారు.

# విడుదలకు రెడీ అవుతున్న అఖిల్ లెనిన్




అక్కినేని యువ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ 'లెనిన్'. 'వినరో భాగ్యము విష్ణుకథ' ఫేమ్ మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు మనం ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ ఊరమాస్ గ్రామీణ ప్రేమకథా చిత్రం జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. టీజర్, సాంగ్స్ రిలీజ్ అయ్యాక ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ప్రీ-రిలీజ్ థియేట్రికల్ బిజినెస్ సర్కిల్స్‌లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బిజినెస్ క్లోజ్ అయినట్లు టాక్. రాయలసీమ మినహాయించి మిగిలిన ఆంధ్ర రీజియన్ థియేట్రికల్ హక్కులు దాదాపు రూ. 9 కోట్ల రేషియోలో క్లోజ్ అయింది. అఖిల్ గత చిత్రం ఏజెంట్ బిగ్గెస్ట్ డిజాస్టరా అయినా కూడా 'లెనిన్' స్జబెక్ట్ మరియు ప్రోమోస్ లోని మాస్ అప్పీల్ చూసి బయ్యర్లు ఈ స్థాయి మొత్తాన్ని పెట్టడానికి ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది.ఈ చిత్రంలో అఖిల్ సరికొత్త రఫ్ అండ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తుండగా, ఆయనకు జోడీగా క్రేజీ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే నటిస్తోంది. థమన్ అందిస్తున్న మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. ఈ సినిమాతో అఖిల్ బాక్సాఫీస్ వద్ద సాలిడ్ కంబ్యాక్ ఇవ్వడం ఖాయమని అక్కినేని అభిమానులు నమ్మకంగా ఉన్నారు. ఆంధ్ర ఏరియాలోనే 9 కోట్ల రేషియోలో బిజినెస్ కదా రాయలసీమ మంచి రేట్ వచ్చే అవకాశం ఉంది. ఇక నైజాంలో అన్నపూర్ణ సొంత డిస్టిబ్యూషన్ పైనే రిలీజ్ చేసే అవకాశం ఉంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613